PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 114 | విజయవాడ, శుక్రవారం 25 నవంబర్ 2022 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 25 November 2022 | Rs

మిర్చికి మాంద్యం దెబ్బ?

- విదేశాలకు నిలిచిన ఎగుమతులు
- ధరల పెరుగుదల కూడా కారణమే!

● లోపలి పేజీలో..●



ఉరుగ్వేను నిలువరించిన కొరియా

- ఫిఫా ప్రపంచకప్-2022

● లోపలి పేజీలో..●

ఎందుకీ మెరుపు వేగం?



- ఒక్క రోజులోనే ఇసి నియామకంపై కేంద్రానికి సుప్రీం ప్రశ్న
- తీర్పు రిజర్వ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర ఎన్నికల కమిషనర్‌గా మాజీ ఐఎఎస్ అధికారి అరుణ్ గోయల్ నియామకం మెరుపువేగంతో జరిగిందని, ఎందుకంత వేగంగా నియమించారని సర్వోన్నత న్యాయస్థానం ప్రశ్నించింది. ఒక్క రోజులోనే 24 గంటలు కూడా గడవకముందే మొత్తం నియామక ప్రక్రియ ఎలా పూర్తి చేశారని సుప్రీం కోర్టు ప్రశ్నించింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఈసి), ఎన్నికల కమిషనర్ల (ఈసి) నియామకానికి ప్రస్తుత వ్యవస్థ సరికాదని, కొలీజియం వంటి వ్యవస్థను, స్వతంత్ర యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై గురువారం కూడా జస్టిస్ కెఎం జోసెఫ్, జస్టిస్ అజయ్ రస్తోగి, జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ హృషికేశ్ రాయ్, జస్టిస్ సిటి రవికుమార్‌లతో కూడిన సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం విచారణ కొనసాగించింది. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఈసి అరుణ్ గోయల్ నియామకానికి సంబంధించిన ఫైళ్లను ధర్మాసనానికి అటార్నీ జనరల్ (ఏజి) ఆర్. వెంకటరమణి సమర్పించారు.

నలుగురిలో చిన్నవాడిని ఎలా నియమించారు?

పిటిషనర్ తరపు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్, గోపాల్ శంకర్‌నారాయణన్ వాదనలు వినిపిస్తూ అరుణ్ గోయల్ గురువారం సర్వీస్ నుంచి స్వచ్ఛంద పదవీ విరమణ చేశారని, రెండు రోజుల్లోనే ఆయన నియామకాన్ని నోటిపై చేశారని తెలిపారు. ఒక్క రోజులోనే అపాయింట్‌మెంట్ ఎందుకు చేశారని, ఆరేళ్ల పదవీకాలం తప్పనిసరికాని వ్యక్తిని ఎందుకు నియమించారని అటార్నీ జనరల్‌ను ధర్మాసనం ప్రశ్నించింది. "ఇదేం నియామకం? ఇక్కడ మేం అరుణ్ గోయల్ సామర్థ్యాలను ప్రశ్నించటం లేదు. వాస్తవానికి ఆయన అకడమిక్ పరంగా అద్భుతమైనవారు. కానీ నియామక ప్రక్రియ గురించి మేము ఆందోళన చెందుతున్నాం. గోయల్ ఫైల్‌ను ఎందుకంత హడావుడిగా, వేగంగా ఆమోదించాల్సి వచ్చింది? ఫైల్ మొదలుపెట్టిన రోజే అపాయింట్‌మెంట్ ఎలా జరిగింది? మేము ఈ పిటిషన్‌ను నవంబర్ 18న విచారించాం. అదే రోజు ఇసి పదవి కోసం నలుగురి పేర్లను షార్ట్‌లిస్ట్ చేసిన ఫైల్‌ను ప్రధాన మంత్రి కార్యాలయానికి న్యాయశాఖ పంపించింది. అదే రోజున గోయల్ పేరును ప్రధాని సిఫార్సు చేశారు. ఎందుకు ఈ అత్యవసరం? గోయల్ ఎంపికలో ఎందుకంత ఉత్సాహం చూపారు? పార్లమెంట్ ఒక్కరోజులో బిల్లులు పాస్ చేయడంతో మనస్తాపం చెందాం. ఇప్పుడు ఎగ్జిక్యూటివ్ కూడా అదే చేస్తోంది. నలుగురి పేర్లను సిఫార్సు చేస్తే వారిలో చిన్నవాడైన అరుణ్ గోయల్ పేరును ఏ ప్రాతిపదికన ఎంపిక చేశారు? ఆయనను మాత్రమే ఎలా నియమించారు? మిగతా వారిని ఏ ప్రాతిపదికన తిరస్కరించారు? దీనికి అనుసరించిన పద్ధతి ఏమిటి?" అని ధర్మాసనం ప్రశ్నించింది.

సూపర్ ఫాస్ట్‌గా నియామకం

మే 15 నుంచి కేంద్ర ఎన్నికల కమిషనర్ పోస్టు ఖాళీగా ఉందని, మే 15 నుంచి నవంబర్ 18 మధ్య ఏం జరిగిందో చెప్పాలని ఏజిని జస్టిస్ అజయ్ రస్తోగి ప్రశ్నించారు. మొత్తం ప్రక్రియను అర్థం చేసుకోవడానికే ప్రశ్నిస్తున్నామని, అంతేతప్ప తాము కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకమని భావించకూడదని ధర్మాసనం పేర్కొంది. ఈ అపాయింట్‌మెంట్ ఒకే రోజు సూపర్ ఫాస్ట్ చేయడానికి ప్రభుత్వానికి ఏమొచ్చింది? అని ప్రశ్నించింది. "నియామకానికి అదే రోజు ప్రక్రియ, అదే రోజు క్లియరెన్స్,

మిగతా 2లో

చిక్కిపోతున్న సున్నా వడ్డీ

ఏడాదేడాదీ తగ్గుతున్న రైతులు, లబ్ధి

- మసకబారుతున్న నవరత్నం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

రైతు రుణాలపై ప్రభుత్వం చెల్లించే వడ్డీ రాయితీ ఏడాదేడాదీ బక్కచిక్కిపోతోంది. రీయింబర్స్ చేసే సొమ్ముతో పాటు లబ్ధిదారుల సంఖ్య సైతం అంతకంతకూ కుంచించుకుపోతోంది. లక్ష రూపాయల్లోపు రైతులు బ్యాంకుల నుంచి తీసుకునే స్వల్పకాలిక పంట రుణాలకు సున్నా వడ్డీ అనగా, పంపిణీ చేసిన అప్పులు, పొందుతున్న లబ్ధికి మధ్య భారీ వ్యత్యాసం నెలకొంటోంది. నవరత్నాల్లో భాగంగా 'వైఎస్‌ఆర్ సున్నా వడ్డీ' పథకాన్ని మూడేళ్ల నుంచి సర్కారు అమలు చేస్తోంది. ముచ్చటగా మూడో తడవ ఈ నెల 28న సున్నా వడ్డీని రైతుల బ్యాంక్ ఖాతాల్లోకి నేరుగా జమ చేయనున్నట్లు ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. తొలేట ఖరీఫ్‌లో ఇచ్చిందే తక్కువ కాగా రెండవ ఏట ఇంకా తగ్గిపోయింది. ఇప్పుడు మూడవ ఏట అంతకంటే ఇంకా తగ్గిపోయింది. రబీ పరిస్థితి కూడా అలాగే ఉంది.



మాట మార్పు

రైతులు బ్యాంకులకు 'అసలు' చెల్లిస్తే చాలు, వడ్డీ విషయం ప్రభుత్వమే చూసుకుంటుందని ఎన్నికల ముందు వైసిపి హామీ ఇచ్చింది. అధికారంలోకొచ్చాక మాట మార్చింది. రైతులు ముందుగా వడ్డీతో సహా తీసుకున్న అప్పును బ్యాంకులకు చెల్లించిన అనంతరం వడ్డీ చెల్లిస్తామంది. వ్యవసాయ రుణాలపై 7 శాతం వడ్డీ ఉండగా, రూ.లక్ష లోపు రుణాలపై కేంద్రం మూడు శాతం వడ్డీ రాయితీ ఇస్తే, తతిమ్మా 4 శాతం వడ్డీ రాష్ట్రం పెట్టుకుంటుందని, సున్నా వడ్డీకే రుణాలందుతాయని పేర్కొంది. రూ.లక్ష పైన- 3 లక్షల లోపు రుణాలపై అంతకు ముందున్న పావలా వడ్డీ పథకాన్ని ఎత్తేసింది. కాగా సున్నా వడ్డీ క్లెయిముల పరిష్కారం పూర్తయ్యేసరికి ఏడాదిన్నర దాటిపోతోంది. రైతులు వడ్డీతో సహా అప్పులు చెల్లించాక ఎప్పటికో ప్రభుత్వం వడ్డీ జమ చేస్తోంది. అదీ ఏ సీజన్‌కు ఆ సీజన్ కాకుండా ఖరీఫ్, రబీ రెండూ కలిపి మరుసటి సంవత్సరం చివరాఖరిలో విడుదల చేయడంతో రైతులు వడ్డీ సొమ్ము కోసం నెలల పర్యంతం ఎదురు చూడాల్సి వస్తోంది.

వారిపైనే నెపం

సున్నా వడ్డీ లబ్ధిదారులు, ప్రభుత్వ రీయింబర్స్‌మెంట్ తగ్గిపోవడానికి రైతులే కారణమని ప్రభుత్వం నెపం వేస్తోంది. నిర్ణీత గడువు లోపు రైతులు వడ్డీతో సహా రుణాలు చెల్లించకపోవడం వలన లబ్ధి తగ్గిపోతోందని తప్పించుకుంటోంది. 'సకాలం'లో చెల్లించాలన్న నిబంధన వడ్డీ రాయితీ పొందడానికి రైతులకు అడ్డంకిగా తయారైంది. దాంతో రైతులకు పంపిణీ చేస్తున్న రుణాల్లో నామ మాత్రపు రుణాలకే సున్నా వడ్డీ వర్తిస్తోంది. 2021-22 ఖరీఫ్‌లో బ్యాంకులు రూ.57 వేల కోట్ల పంట రుణాలిచ్చాయి. వాటిలో రూ.లక్ష లోపు రుణాలు 70-80 శాతం వరకు ఉంటాయి. వాటన్నింటికీ (సుమారు రూ.42 వేల కోట్లు) సున్నా వడ్డీ ఇవ్వాలంటే సర్కారు దాదాపు రూ.1,400 కోట్లివ్వాలి. ఇచ్చేది రూ.115 కోట్లు మాత్రమే. 2020-21 రబీలో బ్యాంకులు రూ.51,635 కోట్లిచ్చాయి. వాటిలో రూ.లక్ష లోపు రుణాలపై సున్నా వడ్డీ సుమారు రూ.1,200 కోట్లివ్వాలని అంచనా. ఇస్తామంటున్నది రూ.45 కోట్లు మాత్రమే. రెండేళ్ల నుంచి బడ్జెట్‌లో సున్నా వడ్డీకి రూ.500 కోట్లు ప్రతిపాదిస్తుండగా వాటిలో చాలా మట్టుకు ఖర్చు కావట్లేదు. ఇ-క్రాప్, ఆర్‌బికెలలో లబ్ధిదారుల జాబితా ప్రదర్శన, సోషల్ ఆడిట్, ఉన్నతాధికారుల రాండమ్ చెకింగ్ వంటి వాటి వలన లబ్ధిదారులు ఏరివేతకు గురవుతున్నారు. సున్నా వడ్డీ రైతులకు అందట్లేదు. పథకం నీరుకారిపోతోంది.

క్షీణత ఇలా

2019-20 ఖరీఫ్‌లో సున్నా వడ్డీ లబ్ధిదారుల సంఖ్య 14.5 లక్షలు, జమ చేసిన వడ్డీ రూ.510 కోట్లు. 2020-21 ఖరీఫ్‌లో లబ్ధిదారులు 6.67 లక్షలు, అమౌంట్ రూ.112.7 కోట్లు. రేపో మాపో ఇవ్వబోయే 2021-22 ఖరీఫ్‌లో లబ్ధి పొందనున్న రైతులు 5.68 లక్షలు, విడుదల చేసే సొమ్ము రూ.115.33 కోట్లు. రబీ విషయానికొస్తే 2019-20లో లబ్ధి దారులు 6.27 లక్షలు, అమౌంట్ రూ.128.47 కోట్లు. ఈ నెల 28న 2020-21 రబీ సున్నా వడ్డీ జమ చేస్తున్నారు. లబ్ధిదారులు 2.54 లక్షల మంది, విడుదల చేసే సొమ్ము రూ.45.22 కోట్లని సర్కారు వెల్లడించింది.

మూడేళ్లలో సున్నా వడ్డీ జమ

సీజన్	లబ్ధిదారులు లక్షలు	రీయింబర్స్‌మెంట్ రూ.కోట్లు
ఖరీఫ్		
2019-20	14.50	510.00
2020-21	6.67	112.70
2021-22	5.68	115.33
రబీ		
2019-20	6.27	128.47
2020-21	2.54	45.22

కోర్టు ఫైళ్లు మాయంపై సిబిఐ దర్యాప్తు

- హైకోర్టు తీర్పు

ప్రజాశక్తి-అమరావతి

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దాఖలు చేసిన ఫోర్జరీ కేసు ఫైలు నెల్లూరు జిల్లా కోర్టు నుంచి చోరీ అయిన ఘటనపై సిబిఐ దర్యాప్తునకు హైకోర్టు ఆదేశించింది. కోర్టు ఫైళ్ల దొంగతనం జరిగిన వార్తలను హైకోర్టు సుమోటోగా విచారణ జరిపింది. సిబిఐ దర్యాప్తునకు అభ్యంతరం లేదని విచారణ సమయంలోనే రాష్ట్ర ప్రభుత్వం చెప్పింది. మంత్రి కాకాణి అదే విధంగా చెప్పారు. దీనిపై చీఫ్ జస్టిస్ పికె మిశ్రా, జస్టిస్ డివిఎస్‌ఎస్ సోమయాజులుతో కూడిన డివిజన్ బెంచ్ సిబిఐకి ఆదేశిస్తూ తీర్పు చెప్పింది. విచారణ వేగంగా జరిపి చార్జిషీట్ దాఖలు చేయాలని సిబిఐకి ఉత్తర్వులు జారీ చేసింది. మంత్రి గోవర్ధన్‌రెడ్డిపై టిడిపి నేత, మాజీ మంత్రి సోమిరెడ్డి నెల్లూరు నాల్గవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో పలు ఆధారాలతో కేసు దాఖలు చేశారు. దీనికి చెందిన ఫైల్ మాయమవడంతో, సుమోటోగా హైకోర్టు విచారణ జరిపింది.

ఇళ్ల నిర్మాణంపై నిరంతర పర్యవేక్షణ

- గృహ నిర్మాణశాఖ సమీక్షలో సిఎం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఇళ్ల నిర్మాణం విషయంలో నిరంతర పర్యవేక్షణ చేయాలని, దీనివల్ల ఎప్పటికప్పుడు సమస్యను పరిష్కరించి పనులు వేగంగా జరిగేందుకు అవకాశం ఉంటుందని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అన్నారు. గృహ నిర్మాణశాఖపై సిఎం గురువారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ ఇల్లులేని వారందరికీ ఇళ్లు ఇవ్వడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకూ రూ.5,655 కోట్లు ఖర్చు చేశామని పేర్కొన్నారు. లేఅవుట్లలో సదుపాయాలపైనా దృష్టి సారించాలని, ఎప్పటికప్పుడు ఫోటోలు అప్‌లోడ్ చేయాలనీ ఆదేశించారు. ప్రతి శనివారం హౌసింగ్‌డేగా నిర్వహిస్తున్నామని, ఆ రోజు అందరూ లేఅవుట్లను సందర్శించాలని అన్నారు. అనుకున్న సమయానికల్లా ఇళ్ల నిర్మాణం పూర్తికావాలని వివరించారు. ఆప్షన్-3ని ఎంపిక చేసుకున్న లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణంపై దృష్టి పెట్టాలని, రాజీ పడొద్దని అన్నారు. అన్ని దశల్లోనూ నాణ్యత నిర్ధారణ జరగాలని ఆదేశించారు. క్వాలిటీ ప్రమాణాలు పాటించే విషయంలో గ్రామ సచివాయాల్లో ఉన్న ఇంజనీరింగ్ అసిస్టెంట్ సేవలను విస్తృతంగా వాడుకోవాలని ఆదేశించారు. నిర్మాణాలు పూర్తయ్యేసరికి విద్యుత్, తాగునీరు, డ్రైనేజీ సదుపాయాలు ఉండాలని తెలిపారు. మిలిగిన వాటినీ ఏర్పాటు చేసుకోవాలని వివరించారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, సిఎస్ సమీర్‌శర్మ, ఎపి స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ ఛైర్మన్ దవులూరి దొరబాబు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు అజయ్‌జైన్, విజయానంద్ పాల్గొన్నారు.



ఆన్‌లైన్‌లో టెన్త్ విద్యార్థుల వివరాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అన్ని పాఠశాలల యాజమాన్యాలు 2020-23 విద్యాసంవత్సరం టెన్త్ విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ డి దేవానందరెడ్డి ఆదేశించారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మార్చి/ఏప్రిల్-2023లో జరిగే పరీక్షలకు హాజరయ్యేందుకు దరఖాస్తుల నమోదు, ఫీజు చెల్లింపు ప్రక్రియకు సంబంధించి ప్రధానోపాధ్యాయులు, ఆయా పాఠశాలలు అనుసరించాల్సిన విధివిధానాలను www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయుల సూచనలు, యూజర్ మాన్యువల్ పేరుతో పొందుపరిచిన్నట్లు వివరించారు. విద్యార్థుల వివరాలను నమోదు చేసేందుకు అందులో పేర్కొన్న అన్ని విషయాలను పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు.

అధికారంలోకి వస్తే ఆక్వా సమస్యలు తీరుస్తాం

- చంద్రబాబు హామీ



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వచ్చే ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే ఆక్వారంగ సమస్యలన్నింటిని పరిష్కరిస్తామని తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. టిడిపి కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో 'ఇదే కర్మ ఆక్వా రైతాంగానికి' పేరుతో గురువారం సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన చంద్రబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ చేతకాని తనం వల్లే ఆక్వారంగం సమస్యల మయంగా మారిందని విమర్శించారు. టిడిపి అధికారంలోకి వస్తే నీటిపన్ను, ఎఎంసి సెస్, ట్రాన్స్‌ఫార్మర్ల ధరను పాత రేట్లకే ఇస్తామని హామీ ఇచ్చారు. ఏరియేటర్లు, బోర్డు, మోటార్లు 50శాతం సబ్సిడీకి ఇస్తామని, 24 గంటల పాటూ కరెంట్ సరఫరా అందిస్తామని చెప్పారు. ఆక్వా రంగాన్ని పూర్వ వైభవం తెచ్చే బాధ్యత తనదని అన్నారు. 2014లో తాను ముఖ్యమంత్రి అయిన తరువాత ప్రతి ఏటా ఆక్వా రంగంలో పురోగతి సాధించామని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వ నిర్ణయాల కారణంగా ఖర్చులు రెండు రెట్లు పెరిగాయని, ఫీడ్, మందులు, కరెంట్ బిల్లులు సహా అన్నీ పెరిగిపోయాయని విమర్శించారు. జగన్ విద్యుత్ యూనిట్ రూ.1.50లకు ఇస్తానని రూ.3.85లకు పెంచారని విమర్శించారు. టిడిపి రైతు విభాగం అధ్యక్షులు మర్రెడ్డి శ్రీనివాస రెడ్డి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు, మాజీమంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, నిమ్మకాయల చిన్నరాజప్ప,పత్తిపాటి పుల్లారావు,కొల్లు రవీంద్ర, దేవినేని ఉమామహేశ్వరరావు, నేతలు కొనకళ్ల నారాయణ, బొండా ఉమామహేశ్వరరావు,టిడి జనార్ధన్,నిమ్మల రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

'అంగన్‌వాడీ' రాష్ట్ర మహాసభకు సర్వం సిద్ధం

- నేటి నుంచి గుంటూరులో ప్రారంభం



అంగన్‌వాడీల రాష్ట్ర మహాసభకు సిద్ధమౌతున్న గుంటూరు రెవెన్యూ కళ్యాణ మండపం

ప్రజాశక్తి-గుంటూరు

ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర 10వ మహాసభ శుక్ర, శనివారాల్లో గుంటూరు నగరంలో జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను నిర్వాహకులు పూర్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 500 మంది ప్రతినిధులు హాజరుకానున్నారు. మొదటి రోజు ప్రారంభ సభలో యూనియన్ జాతీయ కార్యదర్శి కె.వరలక్ష్మి, ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షులు ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు, సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నర్సింగరావు, ఎంఎ గఫూర్, ఐద్వా ఆలిండియా ట్రెజరర్ పుణ్యవతి పాల్గొంటారు. రెండో రోజు ముగింపు సందర్భంగా నగరంలో ర్యాలీ నిర్వహించనున్నారు. మహాసభలో ప్రధానంగా కనీస వేతనాలు, రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీల అమలు, ఐసిడిఎస్ వ్యవస్థ పరిరక్షణ కోసం ఉద్యమ కార్యాచరణపై చర్చించి, కర్తవ్యాలు నిర్దేశించనున్నారు. కనీసం వేతనం రూ.26 వేలు ఇవ్వాలని అంగన్‌వాడీలు అనేక సంవత్సరాలుగా పోరాడుతున్నారు. వైఎ-ఎస్ఆర్ సంపూర్ణ పోషణ పథకం అమలు చేస్తున్నారేగానీ, పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు ఇవ్వట్లేదు. కోవిడ్ సమయంలో ఫ్రంట్‌లైన్ వర్కర్లుగా పనిచేసిన అంగన్‌వాడీలు రాష్ట్ర వ్యాప్తంగా 50 మంది చనిపోతే బీమా ఇవ్వలేదు. మినీ సెంటర్ల వర్కర్లకు మెయిన్ వర్కర్ల మాదిరిగా జీతాలు ఇవ్వాలని, సంక్షేమ పథకాలు అందరికీ పూర్తి స్థాయిలో అమలు చేయాలని, కనీస వేతనాలు, గ్రాట్యుటీ తదితర డిమాండ్లపై సమావేశంలో చర్చించనున్నామని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ తెలిపారు.

కాలం చెల్లిన తీగలు

దశాబ్దాల నాటి విద్యుత్తు తీగలు, స్తంభాలు

- వెంటాడుతున్న సిబ్బంది కొరత
- 20 రోజుల వ్యవధిలో 'అనంత'లో ఏడుగురు మృతి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో కాలం చెల్లిన తీగలు, విద్యుత్తు సామాగ్రి ప్రజల ప్రాణాలను బలి తీసుకుంటున్నాయి. 1963 ప్రాంతంలో వేసిన విద్యుత్తు స్తంభాలు, తీగల (కండక్టర్సు)ను మార్చకుండా అలాగే కొనసాగిస్తున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో సుమారు 10 వేల నుంచి 20 వేల వరకు పాత విద్యుత్తు స్తంభాలు, 3400 కిలోమీటర్ల మేర విద్యుత్తు తీగలు ఆరు దశబ్దాల నుంచి కొనసాగిస్తూనే ఉన్నారు. దీంతో తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. 20 రోజుల వ్యవధిలోనే ఏడుగురు మరణించారు.

హెచ్‌విడిఎస్‌లోనే అత్యధిక ప్రమాదాలు

2016లో ప్రపంచబ్యాంకు నిధులతో అనంతపురం, కర్నూలు జిల్లాలో హెచ్‌విడిఎస్ (హైఓల్టేజీ డిస్ట్రిబ్యూసన్ సిస్టమ్) కింద రూ.1658 కోట్లతో వ్యవసాయ మోటర్లకు ప్రత్యేకంగా విద్యుత్తు లైన్ల ఏర్పాటుకు టెండర్లు పిలిచారు. 2018 నుంచి పనులు కొనసాగుతూనే ఉన్నాయి. వ్యవసాయానికి మెరుగైన విద్యుత్‌ను అందించే పేరుతో ఈ పనులను చేపడుతున్నారు. ఇందుకు సంబంధించి 725 వ్యవసాయ ఫీడర్ల కింద పనులు చేపట్టారు. అయితే ఈ కొత్త లైన్‌లు ఏర్పాటు చేసే సమయంలో పాత ఎల్టీ లైన్స్‌నే వేస్తున్నట్టు సమాచారం. కాలం చెల్లించినవి కావడంతో చాలాచోట్ల అతుకులు కనిపిస్తున్నాయి. ఈ అతుకుల్లో నాణ్యత లేని తీగల్లో విద్యుత్తు సరఫరా అయినప్పుడు ఎగుడు, దిగుడులు వచ్చినా... ఏదైనా కాకి, ఉడత షార్టు చేసినా వెంటనే తెగి పడిపోతున్నాయి. తెగిన వెంటనే విద్యుత్ సరఫరాని నిలిపివేసే బ్రేకర్లు సరిగాలేకపోవడంతో యథావిధిగా విద్యుత్తు సరఫరా అయ్యి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.



ఈ నెల 2న విద్యుత్ తీగ తెగి పడడంతో ప్రమాదానికి గురైన ట్రాక్టర్ ఇదే.. (ఈ ప్రమాదంలో ఐదుగురు వ్యవసాయ కూలీలు మృతి చెందారు)

వెంటాడుతున్న సిబ్బంది కొరత

ఇంతటి ప్రధానమైన విద్యుత్తు శాఖలోనూ క్షేత్రస్థాయి సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో 650 సర్వీసులు, పట్టణాల్లో వెయ్యి సర్వీసులకు ఒక పర్యవేక్షణ సిబ్బంది ఉండాలి. పట్టణ ప్రాంతాల్లో నాలుగు వేల సర్వీసులకు ఒకరు, గ్రామీణ ప్రాంతాల్లో పది వేల సర్వీసులకు ఒకరు చొప్పున పర్యవేక్షణ సిబ్బంది మాత్రమే ఉన్నాయి. కొన్ని చోట్ల నాలుగు నుంచి పది గ్రామాలకు ఒకరు మాత్రమే ఉన్నారు. దీంతో పర్యవేక్షణ సైతం కొరవడుతోంది. ఒక్క అనంతపురం జిల్లా పరిధిలోనే 55 లైన్‌మెన్, 308 ఎఎల్ఎం, 275 జెఎల్ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇక ఇంజినీర్ల కొరత కూడా తీవ్రంగా ఉంది.



మృతి చెందిన రామాంజనేయులు

జూన్ నెలలో సత్యసాయి జిల్లాలోని తాడిమర్రి మండలం చిల్లకొండయ్యపల్లి వద్ద విద్యుత్ తీగ తెగి ఆటోపై పడిన ఘటనలో ఐదుగురు సజీవ దహనమయ్యారు. పెద్దపప్పూరు మండలంలో ఒకరు, కూడేరు మండలంలో ఒకరు అక్టోబరులో చనిపోయారు. నవంబర్ 2న బొమ్మనహల్ మండలంలోని దర్గాహొన్నూరు వద్ద ఐదుగురు మృతి చెందారు. అదే గ్రామంలో బుధవారం ఓ మహిళా మరణించారు. తాజాగా కల్యాణదుర్గం మండలం హుళికల్లు గ్రామానికి చెందిన రైతు వడ్డే రామాంజనేయులు(49) తన పంటకు నీళ్లు పెట్టేందుకు వెళ్లాడు. ట్రాన్స్‌ఫార్మర్‌లో పోయిన ఫీజు మార్చుతుండగా విద్యుత్ షాక్‌కు గురై మరణించారు.

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం : సురేంద్ర, ఎస్ఇ, విద్యుత్ శాఖ

ప్రమాదాల నివారణకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలోనున్న 1070 ఫీడర్ల పరిధిలోనూ సర్వేలు చేపడుతున్నాం. ఎటువంటి సమస్యలున్నాయని పరిశీలిస్తున్నాం. వీటన్నింటినీ పరిశీలించి ప్రమాదాలు చోటు చేసుకోకుండా అవసరమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటాం.

14 మంది ఇళ్ల యజమానులకు లక్ష చొప్పున జరిమానా

ప్రజాశక్తి-అమరావతి

నోటీసులు ఇవ్వకుండానే తమ ఇళ్ల కూల్చివేత చర్యలు పాల్పడుతున్నారని తప్పుడు కేసు దాఖలు చేసిన 14 మంది ఇళ్ల యజమానులకు హైకోర్టు ఒక్కొక్కరికీ రూ. లక్ష చొప్పున రూ.14 లక్షల భారీ జరిమానా విధించింది. నోటీసు ఇవ్వలేదని చెప్పి స్టే ఉత్తర్వులు పొందడం కోర్టుతో ఆడుకోవడమేనని మండిపడింది. స్టేను రద్దు చేయడమే కాకుండా ఇళ్ల నిర్మాణాల కూల్చివేత చర్యలను సవాల్ చేసిన రిట్లను డిస్మిస్ చేసింది. ఈ మేరకు జస్టిస్ రవినాథ్ తిల్హారీ గురువారం తీర్పు చెప్పారు. తాడేపల్లి మున్సిపాల్టీ తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా రోడ్లను ఆక్రమించి నిర్మాణం చేసిన వాళ్లకు అధికారులు నోటీసులు జారీ చేశారు. నోటీసు ఇవ్వకుండా కూల్చివేత చర్యలు తీసుకుంటున్నారంటూ బెల్లంకొండ వెంకట నారాయణ సహా 14 మంది హైకోర్టును ఆశ్రయించడంతో హైకోర్టు స్టే ఇచ్చింది. నోటీసులు ఇచ్చామని అధికారులు మెమో దాఖలు చేశారు.

పిల్ పేరుతో కోర్టు సమయం వృథా

లక్ష జరిమానా విధించిన హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

ప్రజాహిత వ్యాజ్యం పేరుతో కోర్టు సమయాన్ని వృథా చేసిన పిటిషనర్‌కు రూ.లక్ష జరిమానా విధిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మొత్తాన్ని స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీకి 4 వారాల్లోగా చెల్లించాలని ఆదేశించింది. చెల్లించకపోతే పిటిషనర్ జి.సుధాకర్‌రెడ్డి, మరో ఇద్దరి నుంచి ఆ మొత్తం రాబట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలంది. బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణ ప్లాంట్ ఏర్పాటుపై వాళ్లు వేసిన పిల్‌ను చీఫ్ జస్టిస్ పికె మిశ్రా, జస్టిస్ డివిఎస్-ఎస్ సోమయాజులు డివిజన్ బెంచ్ విచారించి తీర్పు చెప్పింది. తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మండలం, మర్రిపూడి గ్రామ పరిధిలో బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణ ప్లాంట్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ పిల్ వేశారు. ఇదే తరహా రిట్ పిటిషనర్లు వేస్తే సింగిల్ జడ్జి ఆర్డర్ ఇవ్వలేదని, దీంతో అదే విషయంపై పిల్ వేశారని పిసిబి అడ్వకేట్ సురేందర్‌రెడ్డి డివిజన్ బెంచ్ దష్టికి తెచ్చారు. దీనిపై హైకోర్టు పిల్ పిటిషనర్లకు భారీ జరిమానా విధిస్తూ ఇటీవల తీర్పు చెప్పింది.

జర్నలిస్ట్ శశిధర్ కస్టోడియన్ మృతిపై సమగ్రవిచారణ జరపండి

డిజిపికి ఎపిడబ్ల్యుజెఎఫ్ వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తిరుపతిలో ఆంగ్లపత్రిక విలేకరి బిఎం శశిధర్ కస్టోడియన్ మృతిపై సమగ్ర విచారణ జరపాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారంనాడు ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి జి ఆంజనేయులు, ఏపిబిజెఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి శ్రీనివాసరావు, రాష్ట్ర నాయకులు అబ్దుల్ అలీమ్, ఎన్ సాంబశివరావులు రాష్ట్ర డిజిపి కెవి రాజేంద్రనాథ్‌రెడ్డిని కలసి వినతిపత్రం అందజేశారు. తిరుపతిలో నవంబర్ 8న రిమాండ్‌లో వున్న హాన్స్ఇండియా విలేకరి శశిధర్ మృతిచెందారని తెలిపారు. గతంలో శశిధర్‌పై ఎలాంటి నేర చరిత్ర లేకపోయినా మత్తుపదార్థాలను సరఫరా చేస్తున్నారనే నెపంతో అరెస్ట్ చేయడం పలు అనుమానాలకు తావిస్తోందని వివరించారు. రిమాండ్‌లో వున్న వ్యక్తి అనారోగ్యంపాలైతే వైద్యం అందించాల్సిన పోలీస్‌లు శశిధర్‌కు వైద్యసేవలు అందించలేదని తెలిపారు. శశిధర్ కస్టోడియన్ మృతిపై సమగ్ర విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

కబ్జాలు, అక్రమ కేసులు : యనమల విమర్శ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విప్లవాత్మకమైన మార్పులు తెస్తున్నానంటూ అవినీతి, అక్రమ కేసులు, భూకబ్జాలను సిఎం జగన్ పెంచి పోషిస్తున్నారని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు విమర్శించారు. అబద్ధాలు, అసత్యాలు, ఆత్మద్రోహాలే తప్ప మూడున్నరేళ్లల్లో రాష్ట్రాభివృద్ధి కోసం చేసింది శూన్యమని ఆయన గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జగన్ పరిపాలన అద్భుతంగా ఉంటే బహిరంగ సభల్లో బారికేడ్లు దూకి ప్రజలు పారిపోవాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. అప్పుల్లో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉందని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు అన్నారు. కేంద్రాన్ని, కాగ్‌ను, కోర్టులను జగన్ మోసం చేస్తున్నారని విమర్శించారు. ఢిల్లీ లిక్కర్ స్కాంలో తనపాత్ర బయటపడి జైలుకు వెళ్తానన్న భయంతోనే విజయసాయిరెడ్డి ఫోన్ పోయిందంటూ నాటకాలు ఆడుతున్నారని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు బొండా ఉమామహేశ్వరరావు విమర్శించారు.

విశాఖ అభివృద్ధికి సహకరించండి

కేంద్ర మంత్రిని కోరిన ఎంపి జివిఎల్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

విశాఖపట్నం ఐటీ హబ్‌గా అభివృద్ధి చేసేందుకు సహకరించాలని రాజ్యసభ ఎంపి జివిఎల్ నరసింహారావు కోరారు. ఈ మేరకు కేంద్ర ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. విశాఖలో ఎస్‌టిపిఐను ఏర్పాటు చేయాలని, ఆర్ఐఎన్ఎల్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను అమలు చేయాలని, ఫ్యాబ్రికేషన్ లాబొరేటరీ (ఫ్యాబ్లాబ్), సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సిడిఎసి) సెంటర్, ఇంటర్నెట్ ఎక్స్ఛేంజ్ ఫాస్ట్ ట్రాకింగ్ మంజూరు చేయాలని కోరారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారని ఎంపి జివిఎల్ తెలిపారు.

రైలుకు రెడ్ సిగ్నల్

- ముందుకుసాగని భూసేకరణ
- నత్తనడకన 11 రైల్వే పథకాలు
- ఏడు పథకాలకు నిధుల కొరత



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

కొత్త ప్రాజెక్టుల ద్వారా రైళ్లు పట్టాలెక్కేందుకు అనేక సమస్యలు బ్రేక్ వేస్తున్నాయి. ఒకవైపు భూసేకరణ కీలక సమస్యగా మారుతుండగా, మరోవైపు నిధులు అడ్డంకిగా మారుతున్నాయి. మొత్తం 11 కీలక ప్రాజెక్టులను ఈ సమస్యలు వేధిస్తున్నాయి. 11 కీలక పనులను గతంలోనే కేంద్ర రైల్వే శాఖ రాష్ట్రానికి కేటాయించింది. నడికుడి-శ్రీకాళహస్తి, కోటిపల్లి-నర్సాపూర్, కడప-బెంగళూరు మధ్య కొత్త లేన్ల నిర్మాణం, గుంటూరు-గుంతకల్, గుంటూరు-గుంతకల్, గుంటూరు-నంద్యాల డబ్లింగ్ పనులు, కాజీపేట్-విజయవాడ మధ్య ట్రిప్లింగ్ పనులు, గుత్తి, రేణిగుంట వద్ద బైపాస్ నిర్మాణం వంటి పనులు ఉన్నాయి. వీటిని రాష్ట్ర, కేంద్ర వాటా నిధులతో పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ మొత్తం పనులకు 4,494 హెక్టార్ల భూమిని సేకరించాల్సి ఉంది. ఇందులో ప్రయివేటు భూమి 2,814 హెక్టార్లు, ప్రభుత్వ భూమి 1,438 హెక్టార్లు, అటవీ భూమి 242 హెక్టార్లు కావాల్సి ఉంటుందని గుర్తించారు. ఇప్పటివరకు 2,023 హెక్టార్లు మాత్రమే సేకరించగా, ఇంకా 2,472 హెక్టార్లు సేకరించాల్సి ఉంది. మొత్తం భూసేకరణలో ప్రయివేటు భూమితోనే ఎక్కువ సమస్యలు వస్తున్నట్లు తెలుస్తోంది. ఈ రంగంలో 2814 హెక్టార్లకుగాను 1161 హెక్టార్లు మాత్రమే సేకరించగలిగారు, ఇంకా 1653 హెక్టార్లు సేకరించాల్సి ఉంది. భూమి యజమానులకు చెల్లించాల్సిన పరిహారం, వారికి కల్పించాల్సిన పునరావాసం వంటి అంశాల కారణంగానే సేకరణలో జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ భూమికి సంబంధించి కూడా ఇదే తరహా జాప్యం కనిపిస్తోంది. 1438 హెక్టార్లకుగాను 743 హెక్టార్లు సేకరించగా, ఇంకా 695 హెక్టార్లు సేకరించాల్సి ఉంది. అటవీ భూమికి సంబంధించి 242 హెక్టార్లకుగాను 118 హెక్టార్లు సేకరించగా, 124 హెక్టార్లను ఇంకా సేకరించాల్సి ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి.

నిధుల సమస్యతో...

ఏడు పథకాలకు రాష్ట్ర ఆర్థికశాఖ నుంచి విడుదల కావాల్సిన రాష్ట్ర వాటా నిధులు విడుదల కాలేదని తెలుస్తోంది. నడికుడి-కాళహస్తి లేన్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఆరు కోట్లు కేటాయించగా, ఇంకా రూ.1306 కోట్లు ఇవ్వాల్సి ఉంది. విజయవాడ-నిడదవోలు డబ్లింగ్ పనులకు రూ.289 కోట్లు ఇవ్వగా, ఇంకా రూ.1798 కోట్లు, కోటిపల్లి-నర్సాపూర్ పనులకు కేవలం రూ.2.7 కోట్లు ఇవ్వగా, ఇంకా రూ.367 కోట్లు ఇవ్వాల్సి ఉంది. భద్రాచలం రోడ్-కొవ్వూరు లేన్‌కు రూ.361 కోట్లు, టుముకూరు-రాయదుర్గం పనులకు రూ.260 కోట్లు ఇవ్వాల్సి ఉండగా ఇంతవరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. ఇది కూడా పనులు ముందుకు సాగకపోవడానికి కారణంగా చెబుతున్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి కేశవరెడ్డి

- రేపు విజయవాడలో సంస్మరణ సభ
- విద్యావేత్త ఎస్ఆర్ పరిమికి స్మారక పురస్కారం



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మార్క్సిస్టు, మానవతావాది, బహుముఖ ప్రజ్ఞాశాలి కొమ్మారెడ్డి కేశవరెడ్డి .. తాను ఎంచుకున్న బాటలో తుదిశ్వాస వరకూ నడిచిన ధీశాలి. విద్య సామాన్యులకు అందుబాట్లో ఉండాలని తపించిన విద్యావేత్త. వివిధ భాషల్లోని మార్క్సిస్టు సాహిత్యాన్ని, చరిత్రనూ తెలుగులోకి తెచ్చిన అనువాదకుడు సాహితీవేత్త. కేశవరెడ్డి గుంటూరు జిల్లా గురజాలకు మూడు కిలోమీటర్ల దూరంలో ఉండే అంబాపురంలో. 1940లో పుట్టారు. అమ్మానాన్నలు ఈశ్వరమ్మ, నరసారెడ్డి. కేశవరెడ్డి ప్రాథమిక విద్య అంబాపురంలో, ఎసెస్సెల్సీ గురజాలలో చదివారు. ఇంటర్ నరసారావుపేటలోనూ, బిఏ కర్నూలులోనూ, బిఇడీ హైదరాబాద్‌లోనూ పూర్తి చేశారు. సూర్యాపేటలో గణితోపాధ్యాయునిగా ఆయన ఉద్యోగ జీవితం మొదలైంది. కేశవరెడ్డికి విద్యార్థి దశ నుంచే కళలు, సాహిత్యం పట్ల ఆసక్తి. హైస్కూలు, కాలేజీ మ్యాగజైన్లలో చందోబద్ధ పద్యాలు, వచన కవితలు, కథలు రాశారు. ఉపాధ్యాయునిగా ఉద్యోగంలో చేరాక సమాజంతో మరింత బంధం, అవగాహన పెరిగాయి. శ్రీశ్రీ మహాప్రస్థానం, కొడవటిగంటి కుటుంబరావు రచనలు ఆయన్ని బాగా ఆకర్షించాయి. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్)లో కీలక బాధ్యతలు చేపట్టాక దశాబ్ద కాలానికి పైగా 'ఐక్య ఉపాధ్యాయ' మాసపత్రికకు సంపాదకునిగా వ్యవహరించారు.

సాహిత్యాన్ని విస్తృతంగా అధ్యయనం చేసే క్రమంలో మాక్సిమ్ గోర్కీ రచనలు కేశవరెడ్డి దృక్పథంలో కొత్త వెలుగులు ప్రసరించాయి. గోర్కీ 'ది సిటీ ఆఫ్ ఎల్లో డెవిల్' నవల ఆయన్ను చాలా ప్రభావితం చేసింది. దీనిని 1980లో 'నగరం' పేరుతో అనువాదం చేశారు. 1981లో 'గోర్కీ కథలు'ను తెనిగించారు. ముప్పయికి పైగా ప్రామాణిక గ్రంథాలను ఆయన తెలుగులో అనువాదం చేశారు. కేశవరెడ్డి సాహితీ స్రవంతి ప్రారంభం నుంచీ దానితో మమేకమై ఉన్నారు. ప్రస్థానం పత్రిక అభివృద్ధికి ఎంతో తోడ్పాటునందించారు. 2020 నవంబరు 26న కేశవరెడ్డి తుదిశ్వాస విడిచారు. ఆయన ఆశయాల కొనసాగింపుగా కుటుంబ సభ్యులు మరుసటి సంవత్సరం నుంచి అనువాద, విద్యా, సాహిత్యరంగాల్లో విశేష కృషి చేసిన ప్రముఖులకు స్మారక పురస్కారం అందిస్తున్నారు. తొలి సంవత్సరం ప్రఖ్యాత అనువాదకులు, సాహితీవేత్త రావెల సాంబశివరావుకు పురస్కారం అందించారు. ఈ ఏడాది విద్యారంగంలో గొప్ప సేవలు అందిస్తున్న ఎస్ఆర్ పరిమికి ఈ పురస్కారం అందించనున్నారు. ఈనెల 26వ తేదీ శనివారం విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో పురస్కార ప్రదాన సభ జరగనుంది.

కొమ్మారెడ్డి కేశవరెడ్డి స్మారక అవార్డు పోస్టర్ ఆవిష్కరణ

విద్యారంగంలో బాలల విద్యపై విశేష కృషి చేస్తున్న వికాస విద్యావనం స్థాపకులు ఎస్ఆర్ పరిమి 'కొమ్మారెడ్డి కేశవరెడ్డి స్మారక అవార్డు'కు ఎంపికయ్యారు. ఈ నెల 26న జరిగే స్మారక సాహితీ అవార్డు కార్యక్రమంలో అందజేయనున్నట్లు యుటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, సాహితీ ప్రస్థానం వర్కింగ్ ఎడిటర్ సత్యాజీ, ప్రజాశక్తి బుక్ హౌస్ జనరల్ మేనేజర్ కె లక్ష్మయ్య ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని యుటిఎఫ్ కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు.

ఇప్పటంలో హైకోర్టును, ప్రజలను తప్పుదోవ పట్టించారు

సజ్జల రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇప్పటం గ్రామంలో రోడ్డు విస్తరణకు సంబంధించిన పనుల్లో తెలుగుదేశం, జనసేన పార్టీలు ప్రజలనే కాదు హైకోర్టును కూడా తప్పుదోవ పట్టించాయని వైసిపి రాష్ట్ర ప్రధానకార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఇప్పటం విషయంలో హై కోర్టు మొట్టికాయలు వేస్తేగాని వీరికి బుద్ధిరాలేదని విమర్శించారు. గురువారంనాడు తాడేపల్లిలో ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబునాయుడు ఇప్పటం గ్రామంలో లేని అంశాన్ని సృష్టించి పవన్‌కల్యాణ్‌తో చేయించిన కుట్రపూరితమైన రచ్చను రాష్ట్రం అంతా చూశారని అన్నారు. పవన్‌కల్యాణ్ సభకు భూములిచ్చిన రైతుల ఇళ్లు కూల్చామనేది పచ్చి అబద్ధమని అన్నారు. నోటీసులు ఇచ్చాకే అక్కడ ఆక్రమణలను తొలగించారని అన్నారు. మైలవరం నియోజకవర్గానికి సంబంధించి మంత్రి జోగిరమేష్, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌లతో మాట్లాడామని అంతా సర్దుకుంటుందని తెలిపారు.

కష్టజీవుల ఉద్యమాలకు కళలే ఆయుధాలు

- ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు
- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభల పాటల సిడి ఆవిష్కరణ



బాలోత్సవ భవన్‌లో జరిగి మీడియా సమావేశంలో పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు తదితరులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కష్టజీవుల ఉద్యమాలకు కళలే ఆయుధాలుగా పనిచేస్తాయని పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహాసభలకోసం ప్రజానాట్యమండలి 'శ్రమజీవుల పోరుగీతాలు' సిడిని రూపొందించింది. విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో ఏపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె ఆంజనేయులు, ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, రాష్ట్ర నాయకులు సుబ్బారెడ్డితో కలిసి ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ఆ సిడిని గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ డిసెంబర్ 8, 9, 10 తేదీల్లో జరగనున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలకు ఈ సిడిలో పాటలు ఎంతో ఉత్తేజాన్ని నింపుతాయన్నారు. వ్యవసాయ కార్మికులకు భూమి, ఉపాధి, కనీస వేతనాలు, సామాజిక న్యాయం లభించాలనే లక్ష్యంతో 1934లో పుచ్చలపల్లి సుందరయ్య నెల్లూరు జిల్లా అలగానిపాడులో వ్యవసాయ కార్మిక సంఘాన్ని స్థాపించారని అన్నారు. అక్కడ ప్రారంభమైన ఈ సంఘం నేడు దేశవ్యాప్తంగా కష్టజీవుల హక్కుల కోసం, చట్టాల సాధన కోసం సమరశీలంగా పోరాడుతోందని తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘాలు నిర్వహించిన పోరాటాల ఫలితంగా పేదలు కొన్ని చట్టాలు, హక్కులు, సంక్షేమ పథకాలు సాధించుకున్నారని వివరించారు. దున్నేవానికే భూమి నినాదంతో సాగిన పోరాటంతో బంజరు భూములు, అనాధీన భూములు, ప్రభుత్వ పోరంబోకు భూములు పేదలకు దక్కాయని తెలిపారు. స్వాతంత్ర్యానంతరం జరిగిన పోరాటాలతో భూసంస్కరణల చట్టం, భూమి సీలింగ్ చట్టం వచ్చిందన్నారు. ప్రభుత్వాలు పేదలకు పంచిన భూములను పెత్తందారుల కబ్జాలనుండి కాపాడుకునేందుకు అసైన్డ్ భూముల అన్యాక్రాంత నిషేధచట్టం వచ్చిందని తెలిపారు. ఆహార భద్రత చట్టం, ప్రజా పంపిణీ వ్యవస్థ, కనీస వేతనాల చట్టాన్ని కూడా సాధించుకున్నారని వివరించారు. మహాత్మా గాంధీ ఉపాధి హామీచట్టం, ఆదివాసీలకు అటవీ హక్కుల చట్టం, 1/70 చట్టం పోరాటాల ద్వారా సాధించుకున్నారని తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం నిర్వహిస్తున్న ఉద్యమాలు, పోరాటాలకు పాటలు, కళారూపాలు బలమైన ఆయుధంగా ఉపయోగపడతాయని అన్నారు. పిఎన్ఎం కార్యదర్శి అనిల్ కుమార్ మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న భూమి, ఉపాధి, వేతనాలు, సామాజిక సమస్యలు, మొదలైన అంశాలతో ప్రజానాట్యమండలి రచయితలు రచించిన ఆరు పాటలతో కూడిన సిడిని ప్రజల్లోకి విస్తతంగా తీసుకెళ్తామని అన్నారు. కె ఆంజనేయులు మాట్లాడుతూ అనేక వీరోచిత పోరాటాలు, త్యాగాలతో సాధించుకున్న చట్టాలన్నిటినీ నేడు కేంద్రంలో వున్న బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను మహాసభల్లో చర్చించి ఉద్యమ కార్యాచరణను రూపొందిస్తామని పేర్కొన్నారు.



కళాకారులతో కలసి జానపద నృత్యం చేస్తున్న మంత్రి రోజ

కళాకారులకు అండగా ఉంటాం : మంత్రి రోజా

గుంటూరులో జగనన్న స్వర్ణోత్సవ సాంస్కతిక సంబరాలు ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

కళాకారులకు గుర్తింపునిచ్చి వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు కృషి చేస్తామని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్‌కె.రోజా తెలిపారు. గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జగనన్న స్వర్ణోత్సవ సాంస్కృతిక సంబరాలను ఆమె గురువారం ప్రారంభించారు. జానపద కళాకారులతో కలిసి నృత్యం చేశారు. రాష్ట్ర సాంస్కృతిక శాఖ చైర్‌పర్సన్ వంగపండు ఉషా డప్పు కళాకారులతో కలిసి పాదం కలపగా, ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా డప్పు వాయించారు. ఈ సందర్భంగా మంత్రి రోజా మాట్లాడుతూ రాష్ట్రంలో కళాకారులకు సంక్షేమ పథకాలు అమలు చేయడం తోపాటు, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జరిగే కార్యక్రమాల్లో భాగస్వామ్యం కల్పిస్తామని తెలిపారు. కళలను ప్రోత్సహించడంలో భాగంగా కూచిపూడి నాట్య పితామహులు వెంపటి చినసత్యం పేరుతో రూ.5 లక్షల పురస్కారం, రచయితలకు రూ.2 లక్షలు నగదు బహుమతితో బోయిబీమన్న పురస్కారం అందిస్తున్నామన్నారు. విశాఖపట్నంలో వంగపండు విగ్రహాన్ని ఆవిష్కరించడంతోపాటు, వారి కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందించామని తెలిపారు. ప్రతి ఏడాది వంగపండు పేరుతో రూ.2 లక్షలతో పురస్కారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు, బాపట్ల ఎంపి నందిగం సురేష్, శాసనమండలి చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీలు డొక్కా మాణిక్యవరప్రసాద్, కల్పలత, ఎమ్మెల్యేలు మహమ్మద్ ముస్తాఫా, ఉండవల్లి శ్రీదేవి, మద్దాళి గిరిధర్ రావు, కిలారి వెంకట రోశయ్య పాల్గొన్నారు.

ప్రజల వద్దకు వెళ్లండి

- ఆర్‌టిఐ కమిషన్‌కు ఇఎఎస్ శర్మ సూచన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సమాచార హక్కు కమిషన్ ప్రజల వద్దకు వెళ్లి నప్పుడే చట్టం నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించినట్టవుతుందని రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఇఎఎస్ శర్మ సూచించారు. స్వచ్ఛందసంస్థలు, సమాచార హక్కు కార్యకర్తలతో రాష్ట్ర ఆర్‌టిఐ చీఫ్ కమిషనర్ ఆర్ఎం బాషా గురువారం జూమ్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఇఎఎస్ శర్మ మాట్లాడుతూ వీలైనప్పుడల్లా కమిషన్ నగరాల్లోని మురికివాడల్లో, ఆదివాసీ ప్రాంతాల్లో పర్యటించి సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించాలని, వారు కోరిన సమాచారాన్ని అక్కడికక్కడే అందిచడానికి ప్రయత్నించాలని అన్నారు. కమిషన్ పోర్టల్‌లోనే ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించాలని, తమ దరఖాస్తులు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకునే అవకాశం ప్రజలకు కల్పించాలని చెప్పారు. ఈ చర్య ద్వారా పారదర్శకత పెరుగుతుందన్నారు. ప్రతి దరఖాస్తుకు ఒక ప్రత్యేకమైన నంబర్ ఇవ్వడంతో పాటు, రాతపూర్వకంగా జవాబు ఇవ్వాలన్నారు. కమిషన్ ఆదేశాలను అమలు చేయని అధికారులపై పెనాల్టీలు వేయడంతో పాటు, వారిపై చర్యలు తీసుకునేలా ఆదేశాలు ఇవ్వాలని చెప్పారు. ఆ ఆదేశాలు అమలయ్యే వరకు ప్రతిదశలోనూ దరఖాస్తుదారులకు ఆన్‌లైన్లో సమా చారం అందుబాటులో ఉంచాలన్నారు. చట్టంలోని 4వ సెక్షన్‌ను అన్ని ప్రభుత్వ కార్యాలయాలు అమలు చేసేలా చూడాలని, అమలు చేయని అధికారుల పేర్లను వెబ్‌సైట్లో ఉంచాలని అన్నారు. కమిషన్ సభ్యులందరూ వారి ఆస్తి, ఆదాయ వివరాలను వెబ్‌సైట్‌లో ఉంచాలని, కేరళలో ఇదే విధంగా చూస్తున్నారని అన్నారు.

తెలుగులో ఉత్తర్వులు : చీఫ్ కమిషనర్ ఆదేశం

సమాచారం కోసం తెలుగులో దరఖాస్తు చేసుకునేవారికి కమిషన్‌తన ఉత్తర్వులను, నిర్ణయాలను తెలుగులోనే ఇవ్వాలని ఆర్‌టిఐ చీఫ్ కమిషనర్ ఆర్ఎం బాషా ఆదేశించారు. ఈ మేరకు ఆయన ఆదేశాలు జారీ చేశారు. తెలుగులో దరఖాస్తు చేసుకున్న వారికి కూడా ఇంగ్లీష్‌లో ఉత్తర్వులను ఇస్తుండటంతో వారు అనేక ఇబ్బందులు ఎదుర్కుంటున్నారని ఆయన ఈ ఆదేశాల్లో పేర్కొన్నారు. డిసెంబర్ ఒకటవ తేది నుండి ఈ ఆదేశాలు అమలు కావాలని పేర్కొన్నారు. అదే విధంగా సవరణలతో సహా సమాచార హక్కుపూర్తి చట్టాన్ని తెలుగు, హిందీ, ఉర్దూ భాషలలో తర్జుమా చేసి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని మరో ఉతర్వులో ఆదేశించారు.

ఉక్కును ప్రైవేటీకరించడం దుర్మార్గపు చర్య

ప్రజాశక్తి-ఉక్కునగరం, విశాఖ

ప్రజల త్యాగాలతో ఏర్పడ్డ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించడం దుర్మార్గపు చర్య అని ప్లాంట్ గుర్తింపు యూనియన్ అదనపు ప్రధాన కార్యదర్శి జె రామకృష్ణ అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 651వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్ ఫర్నేష్ విభాగ కార్మికులు కూర్చున్నారు. దీక్షలనుద్దేశించి రామకృష్ణ మాట్లాడుతూ తమ రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుకునేందుకు తమిళనాడు, తెలంగాణ, కేరళలో అన్నీ రాజకీయ పార్టీలు ఏకమై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తే మన రాష్ట్రంలో మాత్రం అందుకు భిన్నంగా ఉందని విమర్శించారు. కరోనా కష్టకాలంలో సైతం విశాఖ ఉక్కు లాభాలను ఆర్జించిందని తెలిపారు. అలాంటి ప్లాంట్ ఉత్పత్తిని కుంటుపరిచి నష్టాల దిశగా పయనించేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. బొగ్గు కొరత, వర్కింగ్ క్యాపిటల్ కొరత వంటి సాకులతో గతేడాది నుంచి బిఎఫ్-3ని నిలిపివేయడ దుర్మార్గమన్నారు.. విశాఖ ఉక్కుకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ పెరుగుతోందని, ఉక్కు ఎగుమతులపై ఎగుమతి సుంకమూ గణనీయంగా తగ్గిన నేపథ్యంలో యాజమాన్యం ఉత్పత్తిని పెంచే చర్యలను వెంటనే తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీక్షలో డి ఆదినారాయణ, యు రామస్వామి, వి శ్రీనివాసరావు, విళ్లా రామ్మోహన్‌కుమార్, డివి రమణారెడ్డి, కె రాజబాబు, సిహెచ్ సన్యాసిరావు, గుమ్మడి నరేంద్ర, డిశ్రీనివాస్, ఇతర పోరాట కమిటీ నాయకులు మాట్లాడారు.

అభిషేక్ బోయినపల్లికి రిమాండ్

అభిషేక్, నాయర్‌లకు ఢిల్లీ హైకోర్టు నోటీసులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ మద్యం కుంభకోణంలో ఈడీ కస్టడీలో ఉన్న అభిషేక్ బోయినపల్లికి 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్‌ను రౌజ్ అవెన్యూ సిబిఐ ప్రత్యేక కోర్టు విధించింది. మరో నిందితుడు విజయ్ నాయర్‌కు రెండు రోజుల ఈడీ కస్టడి పొడిగించింది. గురువారం వారిద్దరినీ ఈడి అధికారులు రౌస్ అవెన్యూ కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎంకె నాగ్‌పాల్ ముందు హాజరుపరిచారు. అభిషేక్‌కి డిసెంబరు 8 వరకు 14 రోజుల పాటు జ్యుడిషియల్ రిమాండు విధిస్తున్నట్లు న్యాయమూర్తి పేర్కొన్నారు.

'మద్యం'కేసులో నాయర్, అభిషేక్‌లకు ఢిల్లీ హైకోర్టు నోటీసులు

ఢిల్లీ మద్యం కుంభకోణంలో అభిషేక్ బోయినపల్లి, విజయ్ నాయర్‌లకు ఢిల్లీ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. సిబిఐ ప్రత్యేక కోర్టు ఇచ్చిన బెయిలు సవాల్ చేస్తూ సిబిఐ దాఖలు చేసిన పిటిషన్‌ను గురువారం జస్టిస్ యోగేష్ ఖన్నా ధర్మాసనం విచారించింది. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని అభిషేక్ బోయినపల్లి, విజయ్ నాయర్‌కు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ డిసెంబరు 5కు వాయిదా వేసింది. సిబిఐ కేసులో బెయిలు పొందిన వీరిద్దరూ ప్రస్తుతం ఈడి కస్టడీలో ఉన్న విషయం విదితమే.

శరత్ చంద్రారెడ్డి, బినోయ్‌లకు ఇంటి ఆహారం నిరాకరణ

తీహార్ జైలులో జ్యుడిషియల్ రిమాండులో ఉన్న శరత్ చంద్రారెడ్డి, బినోయ్‌బాబులకు ఇంటి ఆహారం అందించడానికి సిబిఐ ప్రత్యేక కోర్టు నిరాకరించింది.

వినియోగదారుల హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యత

పౌరసరఫరాల మంత్రి కారుమూరి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వినియోగదారుల హక్కుల పరిరక్షణకు రాష్ట్రప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. వినియోగదారులకు సత్వర న్యాయం జరిగే విధంగా వినియోగదారుల రక్షణ చట్టాన్ని సవరించడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. మంత్రి అధ్యక్షతన రాష్ట్ర వినియోగదారుల రక్షణ మండలి తొలి సమావేశం సచివాలయంలో గురువారం జరిగింది. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. సవరించిన చట్టం ప్రకారం కొనుగోలు దారులు వస్తువులు ఎక్కడ కొన్నా నివాసం ఉంటున్న ప్రాంతం నుంచే ఫిర్యాదు నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో ఫిర్యాదులను నమోదు చేసుకొని అక్కడ నుంచే వీడియో కాన్ఫరెన్సు ద్వారా విచారణకు హాజరు కావొచ్చునని చెప్పారు. వినియోగదారులు హెల్ప్‌లైన్ టోల్ ఫ్రీ నెంబర్లు 1967, 18004250082 నెంబర్ల ద్వారా ఫిర్యాదులను నమోదు చేసుకోవచ్చునని చెప్పారు. డిసెంబర్ 24న వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. వినియోగదారుల నుంచి వచ్చిన 4407 ఫిర్యాదు కేసులను పరిష్కరించాల్సి ఉందన్నారు. గత 10 నెలల కాలంలో 1,748 కేసులు నమోదు అయ్యాయని చెప్పారు.

ప్రభుత్వమే ధాన్యం కొంటోంది

రైతుల నుంచి ధాన్యాన్ని ప్రభుత్వమే పెద్దఎత్తున కొనుగోలు చేస్తుందని, ఇందులో రైస్ మిల్లర్ల ప్రమేయం ఏమాత్రం లేదని చెప్పారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లర్లకు డబ్బులు ఇచ్చి ప్రభుత్వం ఆడించుకుంటుందని అన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 21 రోజుల్లో రైతులకు సొమ్ము చెల్లించాల్సి ఉన్నా, ఇంకా ముందుగానే రైతుల ఖాతాల్లో సొమ్మును జమచేస్తున్నామని చెప్పారు. తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు.

ఎందుకీ మెరుపు వేగం?

మొదటి పేజి తరువాయి

అదే రోజు నోటిఫికేషన్, అదే రోజు అపాయింట్‌మెంట్ చేశారు. నియామక ఫైల్ 24 గంటల కూడా తిరగలేదు. మెరుపు వేగంతో వెళ్లింది" అని ధర్మాసనం పేర్కొంది.

నాలుగు పేర్లు షార్ట్‌లిస్ట్ చేయడానికి ప్రమాణాలేంటి?

అయితే ఎన్నికల కమిషనర్లందరినీ త్వరితగతిన ప్రక్రియతో నియమిస్తారని ఏజి పేర్కొన్నారు. సాధారణంగా ఈ ప్రక్రియ మూడు రోజుల కంటే ఎక్కువ ఉండదని ఆయన వివరించారు. ఏజీగా తన సంప్రదింపుల వల్ల నియామకం కూడా వేగంగా జరిగిందని అన్నారు. ఎన్నికల కమిషనర్‌గా నియామకానికి ఆమోదం కోసం ప్రధాన మంత్రికి సిఫార్సు చేసిన కేంద్ర న్యాయశాఖ మంత్రి నలుగురి పేర్లను షార్ట్‌లిస్ట్ చేయడం వెనుక ఉన్న ప్రమాణాలేమిటని ధర్మాసనం ప్రశ్నించింది.

దీనికి ఏజి స్పందిస్తూ షార్ట్‌లిస్ట్ చేయడానికి సీనియరిటీ, రిటైర్‌మెంట్, పదవీకాలం వంటి నిర్దిష్టమైన ప్రాతిపదికలు ఉన్నాయని తెలిపారు. కనుక నియమాకం అయిన వ్యక్తి కనీసం ఆరేళ్లు ఎన్నికల కమిషనర్‌గా ఉంటారని చెప్పారు. షార్ట్‌లిస్ట్ చేసిన నాలుగు పేర్లలో ఎన్నికల కమిషనర్‌గా ఆరేళ్లు కూడా ఉండని పేర్లను కూడా ప్రభుత్వం ఎందుకు ఎంపిక చేసిందని జస్టిస్ జోసెఫ్ ప్రశ్నించారు. ఇది సిఈసి అండ్ ఈసి (సర్వీస్ పరిస్థితులు) చట్టం-1991లోని సెక్షన్ 6ని ఉల్లంఘిస్తోందని అన్నారు. "ఏజీ, మీరు ఇటీవలి నియమితులైన వ్యక్తితో ఒకే కేటగిరిలో ఇతర అధికారులు లేరని చెప్పారు. అయితే అదే కేడర్ నుండి అనేక మంది పేర్లు ఉన్నాయి. మేము జాబితాను చూశాం. ఈ పేర్లను ఎలా తీసుకున్నారో మేము తెలుసుకోవాలనుకుంటున్నాం" అని ధర్మాసనం పేర్కొంది. దీనికి ఏజీ స్పందిస్తూ బ్యాచ్ ఒక కొలమానమని, పుట్టిన తేదీ ఒకటి, బ్యాచ్ నుంచి సీనియారిటీ మరొకటి అని పేర్కొన్నారు. డిఒపిటి డేటాబేస్ నుంచే నలుగురి పేర్లను తీసుకున్నారని తెలిపారు. "కాబట్టి చివరికి మీరు అపాయింట్‌మెంట్ అంచున ఉన్న వ్యక్తులను మాత్రమే నియమించాలని అంటున్నారు. తద్వారా వారికి పూర్తి ఆరేళ్ల వ్యవధి లభించదు. అది చట్టమా? మీరు సెక్షన్ 6ను ఉల్లంఘిస్తున్నారు. ఆ సెక్షన్‌లోని ముఖ్యమైన భాగం ఏమిటంటే, ఒకరిని ఆరేళ్ల కాల వ్యవధికి నియమించాలి. ఆయన అంతకంటే ముందు 65 ఏళ్ల వయసుకు చేరుకుంటే పదవీ విరమణ చేయాల్సి ఉంటుంది. ఆ నియమ నిబంధనల ప్రకారం అలా చేయొచ్చా?" అని జస్టిస్ జోసెఫ్ ప్రశ్నించారు.

ఏజీపై జస్టిస్ రస్తోగి ఆగ్రహం

ఒకనొక సమయంలో ఏజి ఆర్.వెంకటరమణి సహనం కోల్పోయి, నియామక ప్రక్రియకు సంబంధించిన మొత్తం అంశాన్ని పరిశీలించకుండా పరిశీలనలు చేయొద్దంటూ ధర్మాసనాన్ని పేర్కొన్నారు. ఏజీ వాదిస్తుండగా సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ జోక్యం చేసుకుని కోర్టుకు నివేదిక సమర్పించబోతుండగా, ఏజీ తీవ్రంగా స్పందించారు. 'దయచేసి మీరు కాసేపు నోరు మూయండి' అంటూ ప్రశాంత్ భూషణ్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. కాసేపటికి జస్టిస్ అజయ్ రస్తోగి జోక్యం చేసుకొని, మీరు (ఏజీని ఉద్దేశించి) కోర్టు చెప్పింది జాగ్రత్తగా వినాలి. ప్రశ్నలకు సమాధానం మాత్రమే ఇవ్వాలి. మేమంతా సంఘటితంగా ఒక పద్ధతి ప్రకారం ముందుకు వెళ్తున్నాం. మీరు ఇష్టానుసారంగా వ్యవహరించడం కుదరదంటూ తీవ్రంగా వ్యాఖ్యానించారు. ఆ వెంటనే ఏజీ స్పందిస్తూ కోర్టుకు సమాధానాలు ఇవ్వడానికి కట్టుబడి ఉన్నానంటూ పేర్కొన్నారు.

తీర్పు రిజర్వ్

ఎన్నికల కమిషన్‌లో సంస్కరణలు, స్వయం ప్రతిపత్తి వంటి అంశాలపై దాఖలైన పిటిషన్లపై నాలుగు రోజుల పాటు సుదీర్ఘ విచారణ జరిపిన రాజ్యాంగ ధర్మాసనం, తీర్పును రిజర్వ్ చేసినట్లు తెలిపింది. ఈ కేసులో లిఖితపూర్వక వాదనలు దాఖలు చేసేందుకు వాద, ప్రతివాదులకు ఐదు రోజుల సమయం ఇచ్చింది.

మిర్చికి మాంద్యం దెబ్బ?



- విదేశాలకు నిలిచిన ఎగుమతులు
- ధరల పెరుగుదల కూడా కారణమే!

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

తెలుగు రాష్ట్రాల నుంచి దాదాపు నెల రోజులుగా ఇతర దేశాలకు మిర్చి ఎగుమతులు పూర్తిగా నిలిచిపోయాయి. ఇందుకు ప్రపంచ వ్యాప్తంగా ఏర్పడిన ఆర్థిక మాంద్యమే కారణమని వ్యాపారులు చెప్తున్నారు. ధర పెరగడం కూడా మరో కారణమని అంటున్నారు. గత సెప్టెంబరు చివరి వరకూ గుంటూరు, వరంగల్, ఖమ్మం తదితర ప్రాంతాల నుంచి బంగ్లాదేశ్, ఇండోనేషియా, సింగపూర్, థాయిలాండ్, ఆఫ్రికన్ దేశాలకు మిర్చి ఎగుమతైంది. గుంటూరు నుంచి ఏటా రెండు లక్షల క్వింటాళ్ల మిర్చి బంగ్లాదేశ్, శ్రీలంక, ఇండోనేషియా, సింగపూర్ తదితర దేశాలకు ఎగుమతి అవుతుంటుంది. ఇందులో 80 శాతం బంగ్లాదేశ్‌కు పంపుతారు. ఆ దేశం నుంచి పలు ముస్లిం దేశాలకు ఎక్కువగా ఎగుమతి జరిగేది. బంగ్లాదేశ్ జంక్షన్ పాయింట్‌గా ఉండేది. బంగ్లాదేశ్‌లో ఏర్పడిన ఆర్థిక సంక్షోభం కారణంగా ప్రస్తుతం ఆ దేశం మిర్చి కొనుగోలు ఆర్డర్లు నిలిపివేసిందని వ్యాపారులు చెప్తున్నారు. లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌సి) జారీ ప్రక్రియను నిలిపివేయడంతో తెలుగు రాష్ట్రాల నుంచి మిర్చి ఎగుమతులు ఆ దేశానికి ఆగిపోయాయి. సింగపూర్, థాయలాండ్, ఫిలిప్పైన్స్‌కు కూడా ఎగుమతులు నిలిచిపోయాయి. ధరలు భారీగా పెరగడం వల్ల ఈ దేశాలు ఆర్డర్లు ఇవ్వడం లేదని వ్యాపారులు చెప్తున్నారు. గతేడాది మిర్చికి తామర తెగులు రావడంతో దిగుబడి గణనీయంగా తగ్గింది. మధ్యప్రదేశ్, మహారాష్ట్రలో కూడా అధిక వర్షాలకు పంట బాగా దెబ్బతింది. దీంతో మిర్చి ఉత్పత్తి తగ్గి ధరలు పెరిగాయి. క్వింటాలు కనిష్ట ధర రూ.20 వేలు, గరిష్ట ధర రూ.30 వేలుపైగా ఉంది. ధరలు భారీగా పెరగడంతో కొన్ని దేశాలు మనదేశం నుంచి మిర్చిని దిగుమతి చేసుకోవడానికి ముందుకు రావడం లేదు. బంగ్లాదేశ్ ఎప్పటికప్పుడు ఎల్‌సిలు ఇచ్చేది. కానీ, గత నెల రోజులుగా ఎల్‌సిలు నిలిపివేసింది. ఆర్థిక సంక్షోభంలో ఉన్న శ్రీలంకకు ఏడాది కాలంగా ఎగుమతులు లేవు. ధర అధికంగా ఉందని, మిర్చిపై పురుగుమందుల అవశేషాలు ఎక్కువగా ఉంటున్నాయని చైనా తదితర దేశాలు దిగుమతికి ఆసక్తి చూపడం లేదు. ప్రత్యామ్నాయంగా స్థానిక ఉత్పత్తులపై ఆధారపడుతున్నాయి. పలు దేశాల్లో మిర్చి లిక్విడ్‌కు డిమాండ్ ఉన్నట్టు తెలిసింది. తెలుగు రాష్ట్రాల నుంచి మిర్చి లిక్విడ్ తయారీ లేకపోవడంతో ఆయా దేశాలు దిగుమతికి ఆసక్తి కనబర్చడం లేదు.



వెంకట నరసమ్మ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పిస్తున్న వి.శ్రీనివాసరావు, సిహెచ్.బాబూరావు, డివి.కృష్ణ, జయరామ్ - చిత్రంలో వెంకట నరసమ్మ కుమారులు ప్రేమ్‌సాగర్, రాహుల్ తదితరులు

వాసిరెడ్డి వెంకట నరసమ్మకు తుది వీడ్కోలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

అభ్యుదయవాది, వామపక్ష శ్రేయోభిలాషి, సీనియర్ జర్నలిస్టు వాసిరెడ్డి సత్యనారాయణ సతీమణి వెంకట నరసమ్మ అంత్యక్రియలు గురువారం విజయవాడ కృష్ణలంక స్వర్గపురిలో ముగిశాయి. కుమారులు ప్రేమ్‌సాగర్, రాహుల్ ఆమె అంత్యక్రియలు నిర్వహించారు. అంతకుముందు సున్నపుబట్టీల సెంటర్ ఐదో నంబరు రూట్‌లోని ఆమె స్వగృహం వద్ద ఉంచిన భౌతికకాయాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, ప్రజాశక్తి సంపాదకులు బి.తులసీదాస్, చీఫ్ జనరల్ మేనేజర్ వై.అచ్యుతరావు, సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి.కృష్ణ తదితరులు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. అభ్యుదయవాది చిక్కవల్లి తిరుమలరావు, ఎంబి విజ్ఞాన కేంద్రం కార్యదర్శి పిన్నమనేని మురళీకృష్ణ, సిబిదియు రాష్ట్ర నాయకులు కాట్రగడ్డ స్వరూపరాణి, జయరామ్, ఐద్వా ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి కె.శ్రీదేవి, నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

విద్యుత్ షాక్‌తో తల్లీకుమారుడు మృతి

ప్రజాశక్తి - కారంపూడి (పల్నాడు జిల్లా)

విద్యుదాఘాతానికి గురైన కుమారుడిని కాపాడబోయి కన్నతల్లి కూడా మరణించిన ఘటన పల్నాడు జిల్లా కారంపూడిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు...కారంపూడి ఇందిరానగర్ కాలనీలో ఓ రెకుల షెడ్డులో తల్లీకుమారులు అంగడి నాగమ్మ (50), రామకోటేశ్వరరావు(30) నివసిస్తున్నారు. ఇంటిలోని ఫ్యాను విద్యుత్ వైర్లు తెగిపోయి ఇనుప తీగమీద పడ్డాయి. అదే సమయంలో ఇనుప తీగమీద బట్టలు వేసేందుకు వెళ్లిన రామకోటేశ్వరరావు విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. గమనించిన తల్లి కుమారుడిని కాపాడుకునేందుకు వెదురు బొంగుతో విద్యుత్ తీగల నుంచి కుమారుడిని వేరు చేయడానికి ప్రయత్నించారు. ఈక్రమంలో ఆమె కూడా విద్యుత్ షాక్‌కు గురై మరణించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తుందుర్రు ఆక్వా ఫుడ్‌పార్క్‌ను తరలించాలి

- సిపిఎం పూర్వ రాష్ట్ర కార్యదర్శి పి.మధు డిమాండ్



ప్రజాశక్తి - నరసాపురం (పశ్చిమగోదావరి జిల్లా)

పశ్చిమగోదావరి జిల్లా తుందుర్రు ఆక్వా ఫుడ్‌పార్క్‌ను ఎవరికీ ఇబ్బంది లేని విధంగా తీరప్రాంతానికి తరలించి, ఆ ప్రాంతంలో ఆక్వా యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని సిపిఎం పూర్వపు రాష్ట్ర కార్యదర్శి పి.మధు డిమాండ్ చేశారు. ఆక్వా ఫుడ్‌పార్క్‌నకు వ్యతిరేకంగా జరిగిన పోరాటం సందర్భంగా నాటి టిడిపి ప్రభుత్వం బనాయించిన కేసులకు సంబంధించి ఆయన గురువారం నరసాపురం కోర్టుకు హాజరయ్యారు.

అనంతరం స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తుందుర్రు అక్వా ఫుడ్‌పార్కును తరలిస్తానని, పోరాట కమిటీ నాయకులపై పెట్టిన అక్రమ కేసులను అధికారంలోకి వచ్చిన వెంటనే ఎత్తివేస్తామని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారని..అధికారంలోకి వచ్చి మూడున్నరేళ్లు గడుస్తున్నా హామీని ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. నర్సాపురంలో ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా తుందుర్రు ఆక్వా ఫుడ్ పార్క్ పోరాట కమిటీ నాయకులను పోలీసులు కొట్టడం దారుణమన్నారు. నర్సాపురం, భీమవరం, తణుకు పరిసర ప్రాంతాల్లో ఆక్వా కాలుష్యంతో ప్రజలు రోగాల బారిన పడుతుంటే జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఏం చేస్తోందని ప్రశ్నించారు. డిసెంబర్ నాలుగో తేదీన తుందుర్రు పరిసర ప్రాంతాల్లో పర్యటిస్తానని తెలిపారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ ధాన్యం కొనుగోలుకు 26 క్వింటాలు పరిమితి పెట్టడం సరికాదన్నారు. గత దాళ్వా, సార్వా ధాన్యం సొమ్ము ఇంకా పూర్తిస్థాయిలో రైతులకు చెల్లించలేదని, ఇలాగైతే రైతాంగం వ్యవసాయం ఎలా చేయాలని ప్రశ్నించారు. రైతుభరోసా కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్, కవురు పెద్దిరాజు పాల్గొన్నారు.

నేడు ఆర్‌టిసి ఉద్యోగుల ధర్నాలు : ఎస్‌డబ్ల్యుఎఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్‌టిసి ఉద్యోగులకు చెల్లించాల్సిన లీవ్‌ఎన్‌క్యాష్‌మెంట్ నిధులను తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అన్ని ఆర్‌టిసి డిపోల ఎదుట శుక్రవారం జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని ఎపిపిటిడి (ఆర్‌టిసి) స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఎపిపిటిడి(ఆర్‌టిసి) స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు ఎస్‌కె జిలాని బాషా, సిహెచ్ సుందరయ్య గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆర్‌టిసి ఉద్యోగులకు 2017 నుంచి లీవ్‌ఎన్‌క్యాష్‌మెంట్ డబ్బులను చెల్లించడం లేదని తెలిపారు.

అమ్మకానికి ఆస్తులను గుర్తించండి

- మంత్రులకు కేంద్రం ఆదేశాలు

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2022-23)గాను ఆస్తుల నగదీకరణ (మానిటైజేషన్)కు నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరడానికి గాను ప్రయత్నాలు వేగవంతం చేయాలని ఆయా మంత్రిత్వ శాఖలకు కేంద్రం ఆదేశాలు జారీ చేసినట్లు గురువారం రిపోర్టులు వచ్చాయి. 2022-23లో రూ.1,62,422 కోట్ల విలువ చేసే ప్రభుత్వ ఆస్తులను విక్రయించాలని లక్ష్యంగా పెట్టుకోగా.. ఇప్పటి వరకు రూ.33,422 కోట్ల ఆస్తులను విక్రయించింది.

అమరావతే ఏకైక రాజధాని

- పిసిసి నూతన అధ్యక్షులు గిడుగు రుద్రరాజు డిమాండ్

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు

ఆంధ్రప్రదేశ్‌కు అమరావతే ఏకైక రాజధానిగా కొనసాగాలని, ఇదే కాంగ్రెస్ పార్టీ విధానమని పిసిసి నూతన అధ్యక్షులు గిడుగు రుద్రరాజు అన్నారు. పిసిసి నూతన అధ్యక్షులుగా నియమితులైన రుద్రరాజుకు విశాఖపట్నం జగదాంబ జంక్షన్ సమీపంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం అభినందన సభ ఏర్పాటుచేశారు. విశాఖ నగర కాంగ్రెస్ అధ్యక్షులు గొంప గోవిందరాజు ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో రుద్రరాజు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, పార్టీలోకి ఎవరు వచ్చినా ఆహ్వానిస్తామని తెలిపారు. ముఖ్యంగా బిజెపి, వైసిపికి వ్యతిరేకంగా తమతో కలిసి వచ్చిన వారిని కలుపుకొని పోతామన్నారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడోయాత్ర పార్టీ బలోపేతానికి దోహదపడుతుందని తెలిపారు. ప్రత్యేక హోదాకు కాంగ్రెస్ కట్టుబడి ఉందని, అధికారంలోకి వస్తే తొలి సంతకం హోదాపైనే ఉంటుందని చెప్పారు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ప్రయివే టీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామన్నారు. త్వరలో విజయవాడలో పిసిసి అధ్యక్షునిగా బాధ్యతలు చేపడతానని చెప్పారు. సమావేశంలో పార్టీ ఎస్‌సి సెల్ రాష్ట్ర అధ్యక్షులు వినయ్ కుమార్, రాష్ట్ర ఒబిసి సెల్ కో-ఆర్డినేటర్ వైఎస్ జగన్నాధరావు, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు ఆర్ శ్రీరామమూర్తి, మూల వెంకటరావు పాల్గొన్నారు.

డ్యూటీలు లేవు.. సెలవులో వెళ్లండి

- డ్రైవర్లు, కండక్టర్లను ఆదేశిస్తున్న ఆర్‌టిసి యాజమాన్యం
- అద్దెబస్సులతో రెగ్యులర్ ఉద్యోగులకు ముప్పు
- వచ్చే ఏడాది మరో వెయ్యి అద్దె బస్సులకు టెండర్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వంలో విలీనం చేయడం ద్వారా తమ జీవితాల్లో వెలుగులు వస్తాయని ఆశించిన ఆర్‌టిసి ఉద్యోగులకు ఇప్పుడు అద్దెబస్సుల రూపంలో వారి ఉనికికే ముప్పు ఏర్పడింది. ఇన్నేళ్లు సెలవులు కూడా లేకుండా పని చేసిన ఆర్‌టిసి ఉద్యోగులకు పరిస్థితి ఇప్పుడు అంతా రివర్స్ అవుతోంది. ఇటీవల కాలంలో ఆర్‌టిసి సొంత బస్సులను పెంచుకునే బదులు అద్దె బస్సులను తీసుకుంటోంది. దీనివల్ల రెగ్యులర్ డ్రైవర్, కండక్టర్లకు డ్యూటీలు తగ్గిపోతున్నాయి. కొద్దిమందిని ట్రాఫిక్ డ్యూటీలకు పంపిస్తున్నారు. మరికొంతమందిని డిపోల్లో భద్రతా చర్యలకు కేటాయిస్తున్నారు. డ్యూటీలు అంతకంతకూ తగ్గిపోతుండటంతో కొద్దిమందికి బలవంతపు సెలవులు ఇచ్చేస్తోంది. వారికి జీతాల్లోనూ కోత విధిస్తోంది.



ఎపిఎస్ ఆర్‌టిసిలో మొత్తం 11,236 బస్సులుంటే అందులో 2,350 అద్దెబస్సులే. కాలంచెల్లిన బస్సుల స్థానంలో కొత్తగా ఒక్కబస్సూ కొనుగోలు చేయని యజమాన్యం ఏటేటా అద్దెబస్సులను పెంచుకుంటూ పోతోంది. 2022లో దాదాపు వెయ్యి అద్దెబస్సులకు టెండర్లు పిలిచిన ప్రభుత్వం 2023లోనూ మరో వెయ్యి అద్దె బస్సులను తీసుకునేందుకు ప్రణాళికలను తయారు చేస్తోంది. ఆర్‌టిసికి గుదిబండగా మారిన ఇందన ధరలనుండి బయటపడేందుకు తీసుకుంటున్న విద్యుత్ బస్‌లన్నీ అద్దెబస్సులు కావడం ఆందోళన కలిగించే అంశం. ఇప్పటికే 100 విద్యుత్ బస్సులను అద్దెకు తీసుకున్న ఆర్‌టిసి ఇకపై విద్యుత్ బస్సులన్నీ అద్దె ప్రాతిపాదికనే తీసుకునేందుకు ఆలోచన చేస్తోంది. దీనివల్ల రెగ్యులర్ ఉద్యోగులకు పని తగ్గిపోతోంది. మరోవైపు గత ఐదేళ్లుగా ఆర్‌టిసిలో కొత్త ఉద్యోగ నియమకాలు చేపట్టలేదు. ఇప్పుడు వున్న ఉద్యోగుల సంఖ్య కూడా ఏటేటా తగ్గిపోతోంది. మొన్నటిదాకా ఆర్‌టిసిలో మొత్తం 50 వేలమందికి పైగా ఉద్యోగులుంటే ఇపుడు 49,860కి పడిపోయింది. ప్రస్తుతం 21 వేల మంది డ్రైవర్లు, 17 వేల మంది కండక్టర్లు వున్నారు. కృష్ణా జిల్లాలో మచిలీపట్నం డిపోలో మొత్తం 110 బస్‌లు వుంటే అందులో ఆర్‌టిసి సొంతబస్సులు 58కాగా, అద్దెబస్సులు 52 వున్నాయి. ఇదే తీరులో అన్ని డిపోల్లో అద్దెబస్సులను పెంచుకునేందుకు మొగ్గు చూపుతున్న తీరు పట్ల ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మొత్తం ప్రజారవాణాను నిర్వీర్యం చేసి ఆర్‌టిసిని ప్రైవేట్‌పరం చేసేలా ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

అగ్ని ప్రమాదంలో రెండు బోట్లు దగ్ధం

- రూ 40 లక్షల ఆస్తినష్టం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్(కాకినాడ జిల్లా)

కాకినాడ ఏటిమొగ ప్రాంతంలో వేటకు సిద్ధంగా ఉన్న రెండు బోట్లు అగ్నిప్రమాదానికి గురయ్యాయి. డిఎఫ్‌ఒ ఏసుబాబు తెలిపిన వివరాల మేరకు ఏటిమొగ నుంచి సముద్రంలో వేటకు వెళ్లేందుకు వల్లేటి రాము, నూకమ్మలకు చెందిన రెండు బోట్లలో ఆయిల్‌ను నింపి గురువారం తెల్లవారుజామున ప్రయాణానికి సిద్ధం చేశారు. ఇందులో ఒక బోటు బుధవారమే వేటకు వెళ్లాల్సి ఉండగా డైనమో మరమ్మతుకు గురవ్వడంతో దానిని బాగు చేయించి గురువారం వేటకు సిద్ధం చేశారు. ఆ బోటులోని ముగ్గురు మత్స్యకారులు ఇంజిన్‌ను స్టార్ట్ చేశారు. దీంతో ఒక్కసారిగా డైనమోలో నుంచి మంటలు చెలరేగాయి. పక్కనే ఉన్న ఆయిల్ క్యాన్‌లకు వ్యాపించాయి. దీంతో వెంటనే మత్స్యకారులు కిందకు దూకేశారు. మంటలు చెలరేగడంతో పక్కనే ఉన్న బోటుకూ వ్యాపించాయి. స్థానికులు వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. బోట్లు రెండూ కాలువ మధ్యలో ఉండటంతో మంటలను అదుపుచేయడానికి వీలుకాలేదు. దీంతో డిఎఫ్‌ఒ ఏసుబాబు, సిబ్బంది మరో బోటులో వెళ్లి మంటలను అదుపుచేశారు. అప్పటికే బోట్లు రెండూ పూర్తిగా దగ్ధమయ్యాయి. సుమారు రూ. 40 లక్షల ఆస్తి నష్టం జరిగిందని డిఎఫ్‌ఒ తెలిపారు.

సంపాదకీయం

నిష్పాక్షికతే కీలకం

ఎన్నికల కమిషన్ (ఇ.సి) స్వతంత్రత గురించి చర్చ జరగడం ఇది మొదటి సారి కాదు. భారత్ వంటి సువిశాల ప్రజాస్వామ్య దేశంలో సక్రమ ఎన్నికల నిర్వహణ ఎప్పుడూ సవాలే! కోట్లాది మంది ప్రజానీకం ఎటువంటి ప్రలోభాలకు, ఒత్తిళ్లకు గురికాకుండా నిర్భయంగా ఓటు వేసే వాతావరణాన్ని కల్పించడం ఎన్నికల కమిషన్ ప్రథమ బాధ్యత! ఇంత కీలకమైన కర్తవ్యాన్ని నిర్వహించాల్సి ఉంది కాబట్టే ఎన్నికల కమిషన్ ఎలా ఉండాలన్న అంశంపై రాజ్యాంగ సభలో సుదీర్ఘ చర్చ జరిగింది. భిన్నాభిప్రాయాలూ వ్యక్తమయ్యాయి. ఇ.సి స్వతంత్రతకు ముప్పు వాటిల్లితే ప్రజాస్వామ్య మనుగడకే ప్రమాదం ఏర్పడుతుందన్న ఆందోళన ఆనాడే వ్యక్తమైంది. గంపెడు ఆశలతో, భవిష్యత్‌పై విశ్వాసంతో ప్రారంభమైన ఎన్నికల ప్రక్రియ గడిచిన ఏడున్నర దశాబ్దాల కాలంలో ఎలా మారిందో, ఎక్కడకు చేరిందో ప్రజలు ప్రత్యక్షంగా చూస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఎన్నికల కమిషన్ స్వతంత్రత, నిష్పక్షపాత వైఖరి, కమిషనర్ల నియమాకంపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం లేవనెత్తిన ప్రశ్నలను, చేసిన వ్యాఖ్యలను చూడాలి. 'ప్రధాని స్థాయి వ్యక్తిపై ఆరోపణలు వచ్చినా ఎన్నికల కమిషన్ స్పందించి చర్యలు తీసుకోవాలి' అంటూ ధర్మాసనం చేసిన వ్యాఖ్య దేశ ప్రజల ఆకాంక్షకు అద్దం పడుతోంది. 'జీ హుజూర్ అనే వ్యక్తులను కమిషనర్లుగా నియమిస్తే ఇ.సి కి స్వతంత్రత ఉండదు' అన్న మరో వ్యాఖ్య ప్రస్తుతం నెలకొన్న కఠోర వాస్తవాన్ని కళ్ల ముందు నిలబెడుతోంది.

ఇ.సి స్వతంత్రతను ప్రశ్నార్థకంగా మార్చడమన్నది ఒక్క రోజులో జరిగిందేమీ కాదు. సుదీర్ఘకాలం కేంద్రంలో అధికారంలో కొనసాగిన కాంగ్రెస్ పార్టీకీ ఈ పాపంలో వాటా ఉంది. అయితే, నరేంద్రమోడీ నేతృత్వంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ విధ్వంస ప్రక్రియ మరింత వేగంగా సాగుతోంది. అన్ని రాజ్యాంగ వ్యవస్థలను ఒక వ్యూహం ప్రకారం కబళిస్తున్న బిజెపి ప్రభుత్వం ఇ.సి ని కూడా వదలలేదు. అరుణ్ గోయల్‌ను ఎన్నికల కమిషనర్‌గా నియమించిన తీరు దీనికి తాజా నిదర్శనం. కమిషనర్ల నియామకంపై దాఖలైన ప్రజాప్రయోజన వాజ్యంపై రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరుపుతున్న సమయంలోనే ఈ నియామకం జరపడం మోడీ సర్కారు బరితెగింపునకు నిదర్శనం. కేంద్ర ప్రభుత్వంలో కార్యదర్శిగా ఉన్న గోయల్ చేత స్వచ్ఛంద పదవీ విరమణ చేయించి మరీ ఎన్నికల కమిషనర్‌గా నియమించారు. 'శుక్రవారం ఆయన విఆర్‌ఎస్ తీసుకున్నారు. శనివారమో, ఆదివారమో ఇ.సి గా ఆయన నియామక ఉత్తర్వులు విడుదలయ్యాయి. సోమవారం నుండి ఆయన పనిచేయడం ప్రారంభించారు' అని పిటిషనర్ తరపు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ఇంత వేగంగా పనులు కావడం ఎప్పుడన్నా చూశామా? దీని వెనుక ఎవరి ప్రయోజనాలూ లేవంటే నమ్మడం సాధ్యమా?

మరోవైపు ఎన్నికల ప్రక్రియలో జరుగుతున్న అవకతవకలను ప్రతిపక్షాలు ఇ.సి దృష్టికి తీసుకువెళ్ళినా స్పందన నామమాత్రం గానో, అసలు లేకుండానో ఉండటం దేనికి సంకేతం? తమ ఫ్యాక్టరీల్లో పని చేసే కార్మికులు, ఉద్యోగుల చేత తప్పనిసరిగా ఓటు వేయిస్తామని, ఓటు వేయని వారి పేర్లను నోటీస్ బోర్డులో, వెబ్‌సైట్‌లో పెడతామని గుజరాత్ లోని అనేక కార్పొరేట్ సంస్థల చేత ఏకంగా ఎన్నికల కమిషనే ఎంఓయు కుదుర్చుకుంది. ఓటు వేసి తీరాలని ఒత్తిడి చేయడం రాజ్యాంగ విరుద్ధమని ప్రతిపక్షాలు మొత్తుకుంటున్నా ఇ.సి ఖాతరు చేయడం లేదు. ఈ ఒప్పందం ఎవరికి ఉపయోగపడుతుందో, కార్పొరేట్ సంస్థలు ఎవరి కోసం పని చేస్తాయో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. కర్ణాటకలో లక్షలాది మందిని అక్రమ ఓటర్లుగా చేర్పించారంటూ వెల్లువెత్తుతున్న ఫిర్యాదులపైనా ఇ.సి పెదవి విప్పడం లేదు. మన రాష్ట్రంలో ఎంఎల్‌సి ఎన్నికల్లో అనర్హులను ఓటర్లుగా చేర్పిస్తున్నారంటూ ఆధారాలతో సహా ఫిర్యాదు చేసినా ఫలితం కనిపించడం లేదు. నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వ్యవహరించాల్సిన అత్యంత కీలకమైన వ్యవస్థ డూడూ బసవన్నలతో నిండిపోతే పర్యవసనాలు ఇలాగే ఉంటాయి. ఇదే ధోరణి కొనసాగితే దేశ భవిష్యత్తుకే ప్రమాదం. సుప్రీంకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలోనైనా విస్తృత సంప్రదింపుల ద్వారా ప్రజలకు బాధ్యతగా వ్యవహరించే ఎన్నికల వ్యవస్థ రూపుదిద్దుకుంటుందని ఆశించగలమా!

మంచి మాట



చదువు మనిషిని పూర్తి మానవుడిగా తీర్చిదిద్దుతుంది. చర్చ సంసిద్ధ మానవుడిగా తీర్చిదిద్దుతుంది. రాత కచ్చితమైన మానవునిగా తీర్చిదిద్దుతుంది.

- ఫ్రాన్సిస్ బేకన్, బ్రిటిష్ రాజనీతిజ్ఞుడు.

విశ్లేషణ

ఇ.డబ్ల్యు.ఎస్ రిజర్వేషన్లు

సుప్రీం తీర్పు - పర్యవసానాలు



సామాజిక, విద్యా విషయక, సాంస్కృతిక, ఆర్థిక వెనకబాటుతనాలను అవినాభావ సంబంధంగల అంశాలుగా పరిగణించాలి. అవి పరస్పరం ప్రభావం జేయగల, ప్రభావితం కాగల అంశాలు. అందువలన రిజర్వేషన్లను నిర్ణయించేటప్పుడు, అమలు చేసేటపుడు, అఫర్మేటివ్ యాక్షన్ కార్యక్రమాలను తీసుకునేప్పుడు ఆర్థిక అంశాన్ని విస్మరించడం ఆయా తరగతులలో నిజమైన అర్హులకు అన్యాయం చేస్తుంది. మన దేశంలో సామాజిక ఆర్థిక అణచివేతకు మూలంగా కుల వ్యవస్థ ఉన్నందున సామాజిక అంశానికి ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలి. దానర్థం ఇతర అంశాలకు ముఖ్యంగా ఆర్థిక అంశాన్ని విస్మరించమని కాదు. అలా విస్మరిస్తే మొదటికే మోసం వస్తుంది.



బి.వి. రాఘవులు

ఆర్థికంగా వెనకబడిన తరగతులకు 10 శాతం రిజర్వేషన్ కల్పించిన 103వ రాజ్యాంగ సవరణ చట్టబద్ధమేనని అయిదుగురు సభ్యుల సుప్రీం కోర్టు ధర్మాసనం తీర్పు వెలువరించింది. రాజ్యాంగ సవరణను సమర్థిస్తూ ముగ్గురు, వ్యతిరేకిస్తూ ఇద్దరు న్యాయమూర్తులు విభజన తీర్పు చెప్పడంతో చర్చనీయాంశమైంది. రిజర్వేషన్ల నిర్ణయానికి ఆర్థిక కొలబద్దను వినియోగించడం న్యాయ సమ్మతమేనన్న విషయంలో న్యాయమూర్తులందరూ ఏకీభావం వ్యక్తంజేశారు. కానీ ఇద్దరు న్యాయమూర్తులు ఇతర అంశాల ప్రాతిపదికన రాజ్యాంగ సవరణ న్యాయబద్ధతను తిరస్కరించారు.

సుప్రీంకోర్టు తీర్పు ఒక వివాదాన్ని పరిష్కరిస్తూ మరికొన్ని వివాదాలకు తెర లేపుతున్నదని తన ఆందోళనను వ్యక్తంజేస్తూనే ఇ.డబ్ల్యు.ఎస్ రిజర్వేషన్లను సమర్థిస్తూ ఇచ్చిన తీర్పును భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆహ్వానించింది. ఆర్థికంగా వెనకబడిన తరగతులకు కొంత శాతం రిజర్వేషన్లు విద్య, ఉద్యోగ విషయాలలో ఇవ్వాలని సిపిఐ(ఎం) చాలాకాలం నుండి చెప్తున్నది. బీహార్‌లో కర్పూరీ ఠాకూర్ ప్రభుత్వం 1978లో ఆర్థికంగా వెనకబడిన తరగతులకు 6శాతం రిజర్వేషన్లు కల్పించినపుడు సిపిఐ(ఎం) సమర్థించింది. అదే వైఖరికి అనుగుణంగా పార్లమెంటులో 103వ రాజ్యాంగ సవరణను సమర్థించింది. ఇప్పుడు సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన మెజారిటీ తీర్పును కూడా ఆహ్వానించింది.

సిపిఐ(ఎం) మూడు అంశాల ప్రాతిపదికగా ఇ.డబ్ల్యు.ఎస్ రిజర్వేషన్లను సమర్థిస్తున్నది. మొదటిది, సామాజిక, విద్యా విషయక, సాంస్కృతిక, ఆర్థిక వెనకబాటుతనాలను అవినాభావ సంబంధంగల అంశాలుగా పరిగణించాలి. అవి పరస్పరం ప్రభావం జేయగల, ప్రభావితం కాగల అంశాలు. అందువలన రిజర్వేషన్లను నిర్ణయించేటప్పుడు, అమలు చేసేటపుడు, అఫర్మేటివ్ యాక్షన్ కార్యక్రమాలను తీసుకునేప్పుడు ఆర్థిక అంశాన్ని విస్మరించడం ఆయా తరగతులలో నిజమైన అర్హులకు అన్యాయం చేస్తుంది. మన దేశంలో సామాజిక ఆర్థిక అణచివేతకు మూలంగా కుల వ్యవస్థ ఉన్నందున సామాజిక అంశానికి ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలి. దానర్థం ఇతర అంశాలకు ముఖ్యంగా ఆర్థిక అంశాన్ని విస్మరించమని కాదు. అలా విస్మరిస్తే మొదటికే మోసం వస్తుంది.

రెండవది, రిజర్వేషన్ల పరిధిలోకి రాని తరగతులలో అత్యధికులు ఆర్థికంగా వెనకబడినవారున్నారు. పెట్టుబడిదారీ విధానం దేశంలో విస్తరించేకొలదీ వీరి సంఖ్య పెరుగుతున్నది. వారి పరిస్థితి దుర్భరం అవుతున్నది. ఈ తరగతులలోని యువకులకు విద్యా ఉద్యోగాలు అందుబాటులో లేకుండా పోతున్నాయి. తమ దుస్థితికి ఇతరులకు రిజర్వేషన్లు ఉండడం, లేక తమకు లేకపోవడమేనన్న అపోహలకు గురవుతున్నారు. పాలక వర్గాలు, వారి మీడియా ఈ అపోహలను పెంచుతున్నాయి. పర్యవసానంగా రిజర్వేషన్ వ్యతిరేక భావనలు రోజురోజుకీ తీవ్రమవుతున్నాయి. ఈ మానసిక స్థితి రిజర్వేషన్ వ్యతిరేక ఉద్యమాల ద్వారా గతంలో వెల్లడవడం చూశాము. మండల్ కమిషన్ సిఫార్సుల అమలుకు పూనుకున్నపుడు, రిజర్వేషన్లు లేని తరగతుల లోని పేద, మధ్యతరగతి ప్రజలను రెచ్చగొట్టి పాలకవర్గాలు రిజర్వేషన్ వ్యతిరేక ఉద్యమాన్ని ఉసిగొల్పాయి. రిజర్వేషన్లను తొలగించాలనే స్వార్థపర శక్తులకు (వెస్టెడ్ ఇంటరెస్ట్సుకు) అవకాశం లేకుండా ఆర్థికంగా వెనకబడిన తరగతులలో రిజర్వేషన్ విధానానికి సానుకూలత సాధించాలంటే వారికి కూడా కొంత రిజర్వేషన్ కల్పించడం అవసరం. లేనియెడల రిజర్వేషన్లకే ప్రమాదం వస్తుంది.

మూడవది, సమసమాజ సాధనలో పీడిత వర్గాల ఐక్యతకు ఎంతో ప్రాధాన్యత ఉంది. కార్మికులు, ఉద్యోగుల్లో రిజర్వేషన్ అంశం విభేదాలను, విభజనను సృష్టిస్తున్న సందర్భంలో దాన్ని అధిగమించి వర్గ ఐక్యతను సాధించాలంటే ప్రస్తుత రిజర్వేషన్ పరిధిలోకి రాని తరగతులకు ఆర్థిక ప్రాతిపదికన రిజర్వేషన్లను ఇవ్వడం ద్వారా సామాజిక విభజన వలన ఏర్పడే అనైక్యతను కొంతవరకు నిరోధించే అవకాశం ఉంది.

విధానపరమైన అంశంతోపాటు, రిజర్వేషన్ల పట్ల సానుకూల వాతావరణం ఏర్పర్చడానికి, వర్గ ఐక్యతను బలపర్చుకోవడానికి ఆర్థికంగా వెనకబడిన తరగతులకు కూడా రిజర్వేషన్లను కల్పించడం అవసరం అన్నది సిపిఐ(ఎం) అభిప్రాయం.

కొంతమంది రిజర్వేషన్లకు ఆర్థిక కొలబద్దను ప్రాతిపదికగా తీసుకోవడం రాజ్యాంగ విరుద్ధమని, రాజ్యాంగంలో సామాజిక విద్యా విషయక వెనకబాటుతనాన్ని మాత్రమే కొలమానంగా తీసుకోవాలని ఉంది తప్ప ఆర్థిక వెనకబాటుతనం గురించి ప్రస్తావన లేదని, అందువలన ఇ.డబ్ల్యు.ఎస్‌కు రిజర్వేషన్లు రాజ్యాంగబద్ధం కాదని వాదిస్తున్నారు. ఈ వాదనను సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఆర్థిక న్యాయాన్ని అందించడం కూడా రాజ్యాంగ లక్ష్యమని, అందులో భాగంగా ఆర్థికంగా వెనకబడిన తరగతులకు రిజర్వేషన్లు ఇవ్వడం న్యాయమేనని కోర్టు అభిప్రాయపడింది.

ఇ.డబ్ల్యు.ఎస్ తరగతులను ఇతర సంక్షేమ కార్యక్రమాల ద్వారా అభివృద్ధి చేయవచ్చుగదా, రిజర్వేషన్ల అవసరమేమిటని ఇంకో వాదన ఉంది. ఇప్పుడు రిజర్వేషన్లు అనుభవిస్తున్న సామాజిక తరగతులకు కూడా ఇతర సంక్షేమ కార్యక్రమాలు జమిలిగా అమలవుతున్నాయి. అలా అయినపుడు సామాజిక తరగతుల ప్రయోజనాలకు ఇబ్బంది కలగకుండా ఇ.డబ్లు.ఎస్ తరగతులకు రిజర్వేషన్లు అమలుజేయడాన్ని వ్యతిరేకించడంలో ఔచిత్యం కన్పించదు.

రిజర్వేషన్లనేవి సామాజిక అంశానికి వర్తిస్తాయి తప్ప ఆర్థిక అంశానికి విస్తరించడం అంటే రిజర్వేషన్ స్వభావానికే విరుద్ధం అనే వాదన కూడా ఉంది. ఇతర దేశాల అనుభవాలు, మన దేశంలో రిజర్వేషన్లు పరిణామం చెందిన తీరు చూస్తే ఈ వాదన నిలబడదు. రిజర్వేషన్లు ఆయా దేశాల పరిస్థితులను బట్టి, అవసరాలను బట్టి అమలయ్యాయి. మలేషియాలో మెజారిటీ మలే జాతి ఆర్థిక వెనకబాటుతనం రిజర్వేషన్‌కు ప్రాతిపదికగా ఉంది. అమెరికాలో మూలవాసి అమెరికన్ల కోసం కొన్ని ప్రాంతాలను రిజర్వేషన్లుగా ప్రకటించారు. ఇక్కడ ప్రదేశం రిజర్వేషన్‌గా ఉంది. విద్యా ఉద్యోగాలలో మన లాగా కోటా పద్ధతి కాకుండా, న్యాయ వ్యవస్థ ద్వారా అమలు సాధ్యంగాని నిర్ణీత లక్ష్యాల ద్వారా వైవిధ్యాన్ని సాధించే పద్ధతులలో అఫర్మేటివ్ యాక్షన్ అమలవుతున్నది. ఐర్లండ్ రిజర్వేషన్లకు మత ప్రాతిపదిక ఉన్నది.

మన దేశంలో రిజర్వేషన్ విధానం పరిణామం చూసినా, సామాజిక అంశంతోపాటు అనేక ఇతర అంశాలను కూడా పరిగణనలోకి తీసుకున్నట్టు విదితమవుతుంది. బ్రిటిష్ వలస పాలకులు తమ విభజించు పాలించు విధానంలో భాగంగా 1909లో మత ప్రాతిపదికగా ప్రాతినిధ్య సంస్థల్లో రిజర్వేషన్ ప్రవేశపెట్టారు. బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమాల ప్రభావంతో కొన్ని సంస్థానాలలో 20వ శతాబ్దం ప్రారంభంలో (ట్రావన్‌కోర్, బరోడా వగైరా) బ్రాహ్మణేతరులకు ప్రభుత్వ ఉద్యోగాలలో కొంత రిజర్వేషన్లు కల్పించారు. 1921లో మద్రాస్ ప్రెసిడెన్సీలో జస్టిస్ పార్టీ బ్రాహ్మణేతరులకు రిజర్వేషన్లు అమలుచేసింది. ఈ రిజర్వేషన్లు ప్రధానంగా జమీందార్లు, భూస్వాములు బలంగా ఉన్న శూద్ర కులాలకు ఉద్దేశించబడ్డాయి. అస్పృశ్యతకు గురవుతున్న షెడ్యూల్డ్ కులాలకు డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ నిర్విరామ ఆందోళన, కృషి ఫలితంగా మొదటిసారిగా 1935లో ప్రాతినిధ్య సంస్థల్లో రిజర్వేషన్లు వచ్చాయి. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాతగానీ షెడ్యూల్డ్ తెగలకు రిజర్వేషన్లు కల్పించబడలేదు. షెడ్యూల్డ్ తెగలలో కుల వ్యవస్థ, అస్పృశ్యత లేకపోయినా సాంస్కృతిక, విద్య, ఆర్థిక వెనకబాటు ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించబడ్డాయి. అప్పుడు కూడా వెనకబడిన కులాల అభివృద్ధి విషయం రాష్ట్రాలకు వదిలివేయబడింది. వర్ణ వ్యవస్థ లోని సామాజిక అంశాన్ని పరిగణన లోకి తీసుకుంటే ఈ కులాలన్నీ రిజర్వేషన్లకు అర్హులు. ఈ అంశాన్నిబట్టే అనేక ఆధిపత్య శూద్రకులాలు బి.సి జాబితాలో చేర్చబడి రిజర్వేషన్లు అనుభవిస్తున్నాయి. ఇంకా అనేక కులాలు అటువంటి డిమాండ్‌తో ఆందోళన చేస్తున్నాయి. కానీ వర్ణ వ్యవస్థలో సామాజికంగా అగ్ర వర్ణాలకన్నా దిగువ స్థాయిగా పరిగణించబడే శూద్ర కులాలన్నీ ఒకే మోస్తరుగా వెనకబడి లేవు. వాటిల్లో కొన్ని గ్రామీణ సమాజంలో ఆధిపత్యం వహిస్తున్నాయి. స్వాతంత్ర్యానంతరం ఈ కులాల్లో ధనాఢ్య వర్గాలు అభివృద్ధి అయ్యాయి. ఈ తరగతులలోని నిజమైన అర్హులకు మాత్రమే రిజర్వేషన్ ప్రయోజనం అందాలంటే ఆర్థిక కొలబద్దను వినియోగించడం తప్ప మార్గం లేదు. అందుకే బిసి తరగతులకు క్రీమీలేయర్‌ను మినహాయిస్తూ ఆర్థిక పరిమితి విధించబడింది.

సామాజిక అంశాన్ని రిజర్వేషన్లకు ఏకైక కొలబద్దగా ఉంచాలనేవారు సామాజిక వెనకబాటుతనం అన్ని కులాలకు, తరగతులకు ఏకరూపంగా ఉన్నట్లు చూపించే ప్రయత్నం చేస్తుంటారు. సామాజిక పీడన అసలైన రూపం అస్పృశ్యత, అంటరానితనం. ఇది దళితులకు మిగతా అందరికీ మధ్య ఉన్న సామాజిక అగాధం. దళితులు ఎదుర్కొంటున్న సామాజిక దుస్థితికి, ఇతరులు ఎదుర్కొనే సామాజిక వెనకబాటుతనానికి పోలిక లేదు. అలాగే సేవాకులాలకు మిగిలిన శూద్ర కులాలకు, ముఖ్యంగా వ్యవసాయ కులాలకు మధ్య ఉండే సామాజిక వ్యత్యాసం అనేక రూపాలలో కొట్టొచ్చినట్లు కనపడుతుంది. చాలా సందర్భాలలో శూద్ర కులాలలోని ఆధిపత్య కులాలు సామాజిక వివక్ష పాటింపులో ముందుంటున్న స్థితి చూస్తున్నాం. అగ్రకులాల్లో సైతం ఉపశాఖల మధ్య సామాజిక తారతమ్యాలు, హోదా వ్యత్యాసాలు ఉంటున్నాయి. అందుకే కుల వ్యవస్థను డాక్టర్ అంబేద్కర్ నిచ్చెన మెట్లతో పోల్చారు. వైవిధ్య రూపాలలో కొనసాగుతున్న సామాజిక వివక్షపై పోరాడాలంటే అందరికీ ఒకే కొలబద్దలు సరిపోవు.

దేశంలో ప్రస్తుతం సామాజిక బృందాలపై ఆధారపడిన వర్టికల్ రిజర్వేషన్లతో పాటు, ఇతర అంశాలను పరిగణన లోకి తీసుకున్న సమాంతర రిజర్వేషన్లు కూడా అమలవుతున్నాయి. మహిళలు, వికలాంగులు, క్రీడాకారులు, మాజీ సైనికోద్యోగులు, వెనకబడిన ప్రాంతాలు, స్థానికులు-స్థానికేతరులు వగైరా రిజర్వేషన్లు కూడా అమలవుతున్నాయి. రిజర్వేషన్ల వర్తింపునకు సామాజిక అంశంతో పాటు అనేక అంశాలను పరిగణిస్తున్నారన్నది గమనించవచ్చు. అందుకే ఈ సమస్య పట్ల ఒక సమగ్ర దృక్పథం అవసరం.

సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ముందుకు వచ్చిన మరికొన్ని వివాదాలను పరిశీలించాలి.

'ఆర్థిక కొలబద్ద' సమంజసత్వంపై సుప్రీంకోర్టు ధర్మాసనంలోని మెజారిటీతో ఏకీభవిస్తూనే, 10 శాతం ఇ.డబ్ల్యు.ఎస్ రిజర్వేషన్ 50 శాతం పరిమితిని దాటుతున్నందున అది న్యాయబద్ధం కాదని ఇద్దరు న్యాయమూర్తులు పేర్కొన్నారు. ఈ అభిప్రాయాన్ని తిరస్కరిస్తూ మెజారిటీ తీర్పు 50 శాతం పరిమితి అనుల్లంఘనీయమైనదేమీ కాదని కొట్టిపారేసింది. ఈ వ్యాఖ్యానం 1992లో ఇందిరా సాహ్ని కేసులో సుప్రీంకోర్టు విధించిన పరిమితిని వివాదాస్పదం జేసింది. సిపిఐ(ఎం)తో పాటు అనేక ఇతర శక్తులు 50 శాతం సీలింగును తొలగించాలని, అప్పుడే రిజర్వేషన్లకు అర్హులైన ఇతర తరగతులను ఆ పరిధిలోకి తీసుకురావచ్చని వాదిస్తూ వస్తున్నాయి. తీర్పు ఈ వాదనలను బలపరుస్తున్నది. మండల్ కమిషన్ సిఫార్సులు అమలయినప్పుడు ఓబిసి రిజర్వేషన్లు 27 శాతంగా నిర్ణయించడానికి 50 శాతం పరిమితి తప్ప వేరే కొలబద్దేమీ లేదు. ఇప్పుడు 50 శాతం పరిమితి అనుల్లంఘనీయం కానప్పుడు ఓబిసిలకు, ఎస్‌సి, ఎస్‌టిల వలే జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. అయితే ఓబిసి జనాభా నిష్పత్తిని నిర్ణయించేందుకు సరైన లెక్కలు ప్రస్తుతం లేవు. ఉజ్జాయింపుగా లెక్క వేయడానికి బ్రిటిష్‌వారు నిర్వహించిన 1931 సెన్సస్ వివరాలను వినియోగించుకుంటున్నారు. ఈ సమాచార లేమిని సరిజేసేందుకు అందరూ కోరుతున్నట్లుగా జనగణన సందర్భంగా ఎస్‌సి, ఎస్‌టితో పాటు అన్ని కులాల గణన చేయడం అవసరం. అప్పుడే కొన్ని వివాదాలు సక్రమంగా పరిష్కారం అవుతాయి. ప్రభుత్వం ఈ విషయంలో సత్వరం నిర్ణయం తీసుకోవాలి.

ధర్మాసనం 10 శాతం ఇ.డబ్ల్యు.ఎస్ రిజర్వేషన్‌ను వర్తింపజేసిన తీరు కూడా వివాదాస్పదం అయింది. ఇ.డబ్ల్యు.ఎస్ రిజర్వేషన్ ఇప్పటివరకు రిజర్వేషన్ అనుభవించని తరగతులకు (నాన్ రిజర్వుడ్ కేటగిరీకి) మాత్రమే వర్తిస్తుందని ధర్మాసనం పేర్కొన్నది. అంటే ఈ పది శాతానికి ఎస్‌సి, ఎస్‌టి, బిసి లోని పేదలను అనర్హులను చేయడం ద్వారా ఇంతకుముందు ఉన్న 50 శాతంలో పోటీపడే అవకాశాన్ని 40 శాతానికి కుదించినట్లయింది. 10 శాతం ఇ.డబ్ల్యు.ఎస్ రిజర్వేషన్‌ను జనరల్ కేటగిరీగా భావించి దానికి అన్ని తరగతులలోని పేదలను అర్హులుగా చేయడం ద్వారా లోపాన్ని సరిదిద్దాల్సి ఉంది. లేనియెడల ఎస్‌సి, ఎస్‌టి, బిసి పేదలు గతంలో ఉన్న సౌకర్యాన్ని కోల్పోతారు. అంతేకాక ఇ.డబ్ల్యు.ఎస్ రిజర్వేషన్లు 10 శాతం ఉండాలని ఏ కొలబద్ద ప్రకారం నిర్ణయించారన్న విమర్శకు తావు లేకుండా పోతుంది.

ఇ.డబ్ల్యు.ఎస్ రిజర్వేషన్లకు అర్హత నిర్ణయించేందుకు ప్రభుత్వం ప్రతిపాదించిన ఆర్థిక పరిమితి, మంచి చెడుల జోలికి సుప్రీంకోర్టు పోలేదు. ప్రభుత్వం నిర్దేశించిన 8 లక్షల రూపాయల ఆదాయం, ఐదెకరాల భూమి, వెయ్యి అడుగుల ఇల్లు, వంద గజాల స్థలం పరిమితి సంపన్నులను కూడా రిజర్వేషన్లకు అర్హులను చేస్తున్నది. నిరుపేదలు మాత్రమే అర్హులయ్యే పద్ధతిలో ఆర్థిక పరిమితిని తిరిగి నిర్ణయించకపోతే ఇ.డబ్ల్యు.ఎస్ రిజర్వేషన్ల లక్ష్యం పూర్తిగా దెబ్బతింటుంది.

ఈ వివాదాస్పద అంశాలన్నింటినీ పరిష్కరించి అమలు చేయకపోతే వివాదాలు అనంతంగా కొనసాగుతూనే ఉంటాయి.

ధర్మాసనంలోని ఒక న్యాయమూర్తి జస్టిస్ దారువాలా రిజర్వేషన్ల విధానాన్ని సమీక్షించాలన్న అభిప్రాయాన్ని వెల్లడించారు. ఇటువంటి వాదన కోర్టు బయట అనేకమంది వివిధ సందర్భాలలో గతంనుండి వ్యక్తంచేస్తున్నారు. ఆర్‌ఎస్‌ఎస్ అధినేత గతంలో బహిరంగంగానే ఈ అంశాన్ని ప్రస్తావించారు. క్రమేణా కొన్ని తరగతులలో, మీడియాలో రిజర్వేషన్ వ్యతిరేక ధోరణి ప్రబలుతుందనడానికి ఇదొక నిదర్శనం. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన మొదటి నాలుగు దశాబ్దాలలో ప్రభుత్వ రంగం విస్తరించి, పాలనా వ్యవస్థ పెరిగింది. దీనిమూలంగా రిజర్వేషన్ల వలన విద్యా, వైద్య, ప్రజా ప్రాతినిధ్య రంగాలలోకి కొన్ని కుటుంబాలు అభివృద్ధి కావడానికి తోడ్పడింది. కానీ అత్యధికులకు పెద్దగా ఒరిగిందేమీ లేదు. గత నాలుగు దశాబ్దాలలో వచ్చిన విధాన మార్పులతో ఉన్న పరిమిత రిజర్వేషన్ సౌకర్యం కూడా నిరుపయోగం అవుతున్నది. ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణ, యాంత్రీకరణ మూలంగా విద్య, వైద్యం, ఉపాధి రంగాలలో రిజర్వేషన్లు అమలుకు నోచుకోవడంలేదు. ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు ప్రవేశపెట్టడానికి పాలక వర్గాలు, కార్పొరేట్లు సుముఖంగా లేవు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రైవేటు రంగంలో రిజర్వేషన్‌ను ప్రవేశ పెట్టడంతో పాటు, వాటిని విస్తరించి పటిష్టంగా అమలుచేయడం అవసరం.

మన దేశంలో రిజర్వేషన్ అవసరం తీరిపోయిందని అనుకోవడం తప్పు. పెట్టుబడిదారీ వ్యవస్థ కొనసాగినంత కాలం రిజర్వేషన్ అవసరం తీరిపోదు. ఈ పరిమిత సదుపాయాన్ని కొనసాగిస్తూనే రిజర్వేషన్లు అవసరం లేని సమసమాజ స్థాపనకు సాగిపోవాలి.

/ వ్యాసకర్త : సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు /

★

కామన్ సెన్స్

సర్వభాషలకు 'జనని' సంస్కృతం కాదు!



డా॥ దేవరాజు మహారాజు

జీవ పరిణామం ఎలా జరుగుతూ వచ్చిందో, భాషా పరిణామాలు కూడా అలాగే క్రమ క్రమంగా కొనసాగాయి. వెయ్యేళ్ల క్రితం సంస్కృతం భారతదేశం వచ్చినప్పుడు దానికి లిపి లేదు. అప్పటికి ఇక్కడ వ్యాప్తిలో ఉన్న దేవనాగరి లిపిలో దాన్ని రాయడం ప్రారంభించారు. ఆ తర్వాత కాలంలో అన్ని భారతీయ భాషల్లో సంస్కృతాన్ని రాయడం మొదలుపెట్టారు. తనకై తాను ఒక లిపిని అభివృద్ధి చేసుకోని సంస్కృతం అన్ని భాషలకు 'జనని' ఎలా అవుతుంది? అది ఎదగని భాష! మాటలు భాషగా స్థిరపడాలంటే లిపిని రూపొందించుకోవడం అవసరం. లిపి లేని మాటల్ని (సంభాషణల్ని) హిందీలో 'బోలీ' అంటారు. ఆ రకంగా సంస్కృతం ఒక బోలీ. అది మన దేశం వచ్చాక ఇక్కడి దేవనాగరి లిపి మీద ఆధారపడింది. ఇంతకూ దేవనాగరి లిపి ఎప్పుడు అభివృద్ధి చెందిందీ... అంటే చారిత్రక ఆధారాల ప్రకారం దేవనాగరి లిపి తొమ్మిదో శతాబ్దం తర్వాత మాత్రమే కనిపిస్తోంది. ఆ విధంగా సంస్కృత భాషా వికాసం తొమ్మిదో శతాబ్దం తర్వాతనే జరిగిందని చెప్పాలి. అందువల్ల సంస్కృతం ఆది భాష, సర్వభాషలకు 'జనని' అనేది శుద్ధ అబద్ధం! ఒక తప్పుడు ప్రచారం మాత్రమే.

సంస్కృతం అంటేనే సంస్కరించబడింది అని అర్థం. ముందు ఒక భాష ఉంటేనే, అది సంస్కరించబడితేనే... అప్పుడది సంస్కృతం అయ్యింది. పైగా ఈ భాషకు మన దేశంలో ఒక క్షేత్రమంటూ లేదు. తెలుగు, తమిళం, మళయాళం, బెంగాలీ వంటి భాషలకు నిర్దిష్టమైన క్షేత్రాలు ఉన్నాయి. ఇంగ్లీషు, అరబ్బీ, ఫారసీలకు దేశంలో ఒక నిర్దిష్టమైన భూమి అంటూ లేదు. ఆ భాషలు తెలిసిన వారు దేశంలో అక్కడక్కడా ఉండొచ్చు. భాషకు ఒక భూమి ఉన్నప్పుడు, ఆ భూమి మీద పుట్టిపెరిగిన వారికి అది మాతృభాష అవుతుంది. అక్కడి జనమంతా ఆ భాషే మాట్లాడతారు. ఆర్యులతో పాటు సంస్కృతం బయటి నుండి వచ్చిందే! ఇక్కడ కొన్ని విషయాలు గమనించుకోవాలి. 1. సంస్కృతం మాట్లాడే ప్రదేశం/రాష్ట్రం భారతదేశంలో ఎక్కడా లేదు. 2. మనువాదులు బలవంతంగా తమ హిందూ దేవీ దేవతల పూజల్లో, వ్రతాల్లో, కర్మకాండల్లో ఉపయోగించడం తప్ప, సంస్కృతం ఎక్కడా నిత్య జీవితంలోని సంభాషణల్లో భాగం కాలేదు. 3. సంస్కృతం ఎప్పుడూ ఎక్కడా ప్రజల భాషగా లేదు. ఒకవర్గం వారికే అది పరిమితమైంది. ఇకపోతే సాధారణ శకానికి ముందు (బిసిఈ) అసలు ఎక్కడా దేశంలో సంస్కృతం లేదు- అనేది రుజువయ్యింది. మనువాదుల అబద్ధపు ప్రచారాలు పక్కన పెట్టి మనం వాస్తవం లోంచి విషయం పరిశీలిద్దాం!



అశోకుడి కాలం నాటికి (268-232 బిసిఈ) ఈ దేశంలో ఉన్నది ప్రాకృత భాష. దాని మరొక రూపమే పాలి భాష. ఆ భాషను ధమ్మ లిపిలో రాసేవారు. సాధారణ శకానికి ముందు నాటి స్థూపాలు, శిలాఫలకాల మీద అంతటా ప్రాకృతమే ఉంది. ఎక్కడా దేశంలో సంస్కృత శిలాఫలకాలు లభించలేదు. కారణం ఆ భాషే అప్పటికి లేదు కాబట్టి! ప్రపంచ వ్యాప్తంగా నాగరికతలు ఏర్పడుతూ వచ్చాయి. ఒక్కో నాగరికత ఒక్కోరకమైన మాటల్ని, ఒక్కోరకమైన లిపిని, ఒక్కోరకమైన భాషని రూపొందించుకుంటూ వచ్చాయి. మనకు మన దేశంలో సింధూ నాగరికతలో 4500 ఏళ్ల నాటి లిపి లభ్యమైంది. అయితే దాన్ని ఇప్పటి వరకు ఎవరూ చదవలేకపోయారు. అదే లిపికి దరిదాపులుగా ఉన్న మరికొన్ని లిపులు కూడా లభ్యమయ్యాయి. అవే ధమ్మ లిపి, గోండ్ లిపి వంటివి. వాటిని కూడా పూర్తిగా అర్థం చేసుకునేవారు లేకపోవడం వల్ల అవి అంతర్జాతీయ భాషల జాబితాలో చేరలేదు. వేల సంవత్సరాల తర్వాత అప్పటి అక్షరాలు, అంకెలు, గుర్తులు తెలుసుకోవడం కష్టం. అక్షరమంటే ఒక రకమైన 'కోడ్'. దాన్ని ఎలా పలకాలి? ఎలా పలికితే ఏ అర్థం వస్తుంది? అనేది తెలియనంత వరకు ఏ లిపి అయినా, ఏ భాష అయినా అర్థం కాదు. తర్వాత వచ్చిన చారిత్రక యుగంలోని లిపులు అధ్యయనం చేయడానికి వీలయ్యింది. సమ్యక్ సంస్కృతికి సంబంధించిన ఆధారాలు అనేకం దొరికాయి. అశోకుడి శిలాశాసనాలు అధికంగా లభించాయి. అవన్నీ ధమ్మ లిపిలో ఉన్నాయి. బుద్ధుడి సమకాలికుడైన పసేన్‌జీత్ శిలాశాసనం ఒకటి మధ్యప్రదేశ్ లోని సత్నా జిల్లాలో దొరికింది. అది కూడా ధమ్మ లిపి లోనే ఉంది. ఇదే ఇక్కడ చాలా కీలకమైన విషయం. మనువాదులు చెప్పుకుంటున్నట్టు సంస్కృతమే అతి ప్రాచీనమైన భాష అయితే మొదట ఆ భాషలోని శిలాశాసనాలు దొరకాలి కదా? దొరకలేదు. దొరకవు. ఎందుకంటే సంస్కృతానికి లిపేలేదు. లిపి లేని భాషలో ఎవరు మాత్రం ఏం రాస్తారూ?

సృష్టి ప్రారంభం నుండే సంస్కృతం ఉంది. వేదాలు, పురాణాలు ఆ దేవదేవుడే స్వయంగా మానవులకు అందించాడు - వంటి కట్టు కథల్ని వివేకవంతులు విశ్వసించరు. పరిణామ క్రమం, చారిత్రక ఆధారం, వికాసం ఎలా ఎప్పుడు జరుగుతూ వచ్చాయో పరిశీలించి, పరిశోధించి నిగ్గుతేల్చిన తర్వాత మాత్రమే ఏ విషయాన్నైనా వారు గుర్తిస్తారు. జరిగిన తప్పిదం ఏమిటంటే ధమ్మలిపిలో దొరికిన పాలి శాసనాలు - సంస్కృతంవి అని అబద్ధపు ప్రచారం చేశారు. అంతే కాదు ఒక్కోసారి ధమ్మలిపిని బ్రాహ్మి లిపిగా ప్రకటించారు. ఉదాహరణకు రెండవ శతాబ్దంలో లభించిన జూనాగఢ్ శాసనం పాలి లిపిలో ఉంది. దాన్ని గుర్తించలేక అది సంస్కృతమని భ్రమపడ్డారు. అసలైతే అప్పటికి సంస్కృతం భారతదేశానికి రాలేదు. వచ్చాక అది దేవనాగరి లిపిలో నమోదయ్యింది. చెపితే గిబితే అది దేవనాగరి లిపి అని చెప్పాలి కాని, సంస్కృతం అనడం తప్పు కదా? మరొక ముఖ్య విషయమే మంటే ధమ్మ లిపిలో సంస్కృతం రాయలేరు. పదవ శతాబ్దం తర్వాత 'ధమ్మ'ను 'ధర్మ' అని రాయడం ప్రారంభించారు. పేర్లతో సహా అన్నింటినీ సంస్కృతీకరించడం అప్పటి నుండే ఆరంభమైంది.

బ్రాహ్మణార్యుల మతం-వైదిక మతం; జాతి-ఆర్య జాతి; భాష-సంస్కృతం. మొదట సంస్కృతం ఆరియన్ లేక ఆరియక్ మాండలికానికి సంబంధించిన ఛండా భాష. అది సంస్కరించబడింది. తర్వాత కాలంలో బ్రాహ్మణార్యులు, ద్రావిడ జీవన విధానాల్లోకి తమ పురాతన ఆరియన్ సంస్కృతాన్ని (ఛండా మాండలికాన్ని) జొప్పించారు. అందువల్ల ఆరియన్ మూలాలున్న వైదిక ఛండా భాషగా మాత్రమే సంస్కృతాన్ని గుర్తించాలి! సంస్కృతం లిపి లేని భాషగా చాలా కాలం కొనసాగింది. అది ఈ దేశపు 'నాగరి' లిపిని ఆశ్రయించింది. దానికే దేవ శబ్దాన్ని జోడించి 'దేవనాగరి'గా ప్రచారం చేసుకున్నారు. పనిలో పనిగా సంస్కృతాన్ని 'దేవభాష'గా ఉన్నతీకరించుకున్నారు. అది ఎప్పుడూ వ్యవహార భాషగా లేదు. స్తుతి, స్తోత్రాలతో మాత్రమే కొనసాగింది. ఇప్పటికీ అది వాటికే కుంచించుకు పోయి ఉంది. పూర్తిగా ఇది ఇండో-యూరోపియన్ భాష కాదు. బ్రాహ్మణిజం-సంస్కృతం రెండూ పెనవేసుకుపోయి అర్చక, స్తోత్ర, పూజాది మత పరమైన విషయాలకు మాత్రమే పరిమితమైంది. అలౌకిక విషయాల ప్రచారంలో మునిగిపోయింది. దీన్ని మత ఫాసిజంగా గుర్తించాలి!

/ వ్యాసకర్త: కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు గ్రహీత, జీవశాస్త్రవేత్త/

ఆ పరిహారం ఏ మూలకు?

- మోర్బీ విషాదంపై గుజరాత్ ప్రభుత్వాన్ని నిలదీసిన హైకోర్టు



అహ్మదాబాద్ : గుజరాత్‌లోని బిజెపి ప్రభుత్వంపై ఆ రాష్ట్ర హైకోర్టు తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. ఇటీవల మోర్బీ వంతెన కుప్పకూలిన అత్యంత విషాదకర ఘటనలో మృతుల కుటుంబ సభ్యులకు ప్రకటించిన పరిహారంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసి ప్రభుత్వ తీరును నిలదీసింది. ఈ పరిహారం ఏ మూలకూ చాలదని ఆక్షేపించింది. అంతులేని విషాదంలో మునిగిన కుటుంబాలను ఆదుకునే తీరు ఇదా అని నిలదీసింది. వాస్తవమైన, సముచితమైన పరిహారం అందజేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ ప్రమాదంలో గాయపడినవారికి అందజేసిన పరిహారంపైనా న్యాయస్థానం అసంతృప్తి వ్యక్తం చేసింది. ఆప్తులను కోల్పోయి అనాధలుగా మిగిలినవారికి నెలకు రూ.3000 చొప్పున అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించిన పరిహారం ఏమాత్రం చాలదని పేర్కొంది.

ఈ మొత్తం కనీసం పిల్లల యూనిఫామ్స్, పుస్తకాలు కొనుగోలుకు కూడా సరిపోదని తెలిపింది. ఈ విషాదకర ఘటనలో ఏడుగురు పిల్లలు తల్లిదండ్రులను ఇద్దరినీ కోల్పోయి అనాధలుగా మిగిలారు. మరో 12 మంది చిన్నారులు తమ తల్లిదండ్రుల్లో ఒకరిని కోల్పోయారు. అనాధ పిల్లలకు ప్రకటించిన మొత్తాన్ని కనీసం రెట్టింపు చేయాలని (నెలకు రూ.6 వేలు) లేదా తక్షణం కనీసం రూ.10 లక్షల మొత్తాన్ని అయినా అందజేయాలని ఆదేశించింది. ఈ ప్రమాదంలో బాధితులైనవారి పూర్తి వివరాలను, వారికి పరిహారం అందజేసే విధానానికి సంబంధించి సమగ్ర నివేదికతో అఫిడవిట్ దాఖలు చేయాలని కూడా న్యాయస్థానం ఆదేశించింది. మృతుల జాబితాలో బాధితుల వివరాలను కులాల వారీగా రాష్ట్ర ప్రభుత్వం పేర్కొనడంపై న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇలాంటి విషాదకర ఘటనల్లోనూ కులాల ప్రస్తావన అవసరమేంటని నిలదీసింది. గత అక్టోబరు 30న మోర్బీ వంతెన కూలిన 130 మందికిపైగా చనిపోయిన సంగతి తెలిసిందే.

వంతెనలపై సర్వే

గుజరాత్‌లోని అన్ని వంతెనల పరిస్థితిపై సర్వే నిర్వహించి ఆ వివరాలను కోర్టుకు సమర్పించాలని ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. అవన్నీ సరైన స్థితిలో ఉన్నాయా లేదా? అధ్యయనం నిర్వహించి నిపుణులైన ఇంజనీర్లతో ధ్రువీకరించి 10 రోజుల్లో అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది.



జోడో యాత్రలో ప్రియాంక

భోపాల్ : రాహుల్ గాంధీ చేపడుతున్న భారత్ జోడో యాత్ర ప్రస్తుతం మధ్యప్రదేశ్‌లో కొనసాగుతుంది. గురువారం ఆయన సోదరి ప్రియాంక గాంధీ వాద్రా కూడా యాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ.. మోడీ ప్రభుత్వంలో ప్రజాస్వామ్య మార్గాలన్నీ మూసుకుపోయాయని.. అందుకోసమే ఈ యాత్రను చేపట్టినట్లు తెలిపారు. లోక్‌సభ, ఎన్నికల వ్యవస్థ, మీడియా అన్నీ ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి మనుషులతో నిండిపోయాయని మండిపడ్డారు. న్యాయవ్యవస్థ కూడా ఒత్తిడికి లోనవుతోందని అన్నారు. భారత్‌లో వ్యాప్తి చెందుతున్న హింస, విద్వేషం, భయాలను అడ్డుకోవడం ఈ యాత్ర మొదటి లక్ష్యమని అన్నారు. సెప్టెంబర్ 7న ప్రారంభమైన ఈ యాత్ర బుధవారం బిజెపి పాలిత ప్రాంతం మధ్యప్రదేశ్‌లోకి ప్రవేశించింది.

ఏపి, తెలంగాణలో రూ.573.13 కోట్లతో రోడ్ల విస్తరణ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో రూ.573.13 కోట్లతో రోడ్ల విస్తరణకు కేంద్ర రోడ్డు రవాణ, జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ ఆమోదం తెలిపారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. రూ.573.13 కోట్ల విలువైన ప్రాజెక్టులను ఆమోదించినట్లు పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో కృష్ణా నదిపై ఐకానిక్ బ్రిడ్జి అప్రోచ్‌లతో సహా ఎన్‌హెచ్-167కెను 2/4 లైన్లకు పునరావాసం, ఆధునీకరణకు మొత్తం రూ.436.91 కోట్లు ఆమోదించినట్లు తెలిపారు. ఎన్‌హెచ్-167కె హైదరాబాద్, కల్వకుర్తి, తిరుపతి, నంద్యాల, చెన్నై వంటి ముఖ్యమైన మధ్య దూరాన్ని 80 కి.మీల మేర తగ్గిస్తుందని చెప్పారు.

నోట్లరద్దుపై కీలకపత్రాలను దాచేసింది

- సుప్రీంకోర్టు విచారణలో పి.చిదంబరం వాదనలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

నోట్ల రద్దుపై కీలక పత్రాలను కేంద్రం దాచేసిందని సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది పి.చిదంబరం పేర్కొన్నారు. ఆర్‌బిఐ, కేంద్ర మంత్రివర్గం వద్ద పూర్తి సమాచారం లేదని స్పష్టంచేశారు. 2016 నవంబర్ 8న కేంద్ర ప్రభుత్వం తీసుకున్న రూ.500, రూ.1,000 నోట్లరద్దు నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన 58 పిటిషన్లపై గురువారం జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్, జస్టిస్ బిఆర్ గవాయ్, జస్టిస్ ఎఎస్ బోపన్న, జస్టిస్ వి రామసుబ్రమణియన్, జస్టిస్ బివి నాగరత్నలతో కూడిన ఐదురుగు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరిపింది. సీనియర్ న్యాయవాది, మాజీ కేంద్ర ఆర్థిక మంత్రి పి.చిదంబరం రోజంతా వివరణాత్మక వాదనలు విపించారు. మొత్తం కరెన్సీలో 86 శాతం రద్దు చేస్తున్నట్టు ఎవరికీ చెప్పలేదని అన్నారు. "నవంబర్ 7న ఆర్‌బిఐకి కేంద్ర ప్రభుత్వం రాసిన లేఖ, రిజర్వ్ బ్యాంక్ సెంట్రల్ బోర్డ్ ముందు ఉంచిన ఎజెండా నోట్, సెంట్రల్ బోర్డ్ మీటింగ్ మినిట్స్, వారి సిఫార్సులు, నవంబర్ 8న కేంద్ర మంత్రి వర్గం తీసుకున్న నిర్ణయం వంటి పత్రాలు ఇప్పటికీ లేవు. ఆరేండ్లు గడిచినా ఈ పత్రాలు ఇంకా పబ్లిక్ డొమైన్‌లో ఉంచలేదు" అని చిదంబరం ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. నవంబర్ 8న జరిగిన కీలకమైన సెంట్రల్ బోర్డ్ సమావేశానికి ఎవరు హాజరయ్యారు? ఆర్‌బిఐ చట్టం-1934 ప్రకారం నిర్దేశించిన కనీస డైరెక్టర్ల సంఖ్య, రూపొందించిన నియమ నిబంధనలు వంటి వివరాలను వెల్లడించకుండా ప్రభుత్వం తప్పించుకుందని తెలిపారు. 'పెద్ద నోట్ల రద్దు కసరత్తు మొత్తం దాదాపు 26 గంటల్లో జరిగింది. నవంబర్ 7న మధ్యాహ్నం తరువాత ఆర్‌బిఐకి లేఖ చేరింది. ఆ తరువాత నవంబర్ 8న ఢిల్లీలో సమావేశం కావాలని ఫోన్ ద్వారా సెంట్రల్ బోర్డ్‌ను పిలిచి ఉండవచ్చు. సాయంత్రం 5.30 గంటలకు సమావేశమై, గంట, గంటన్నరలోపు ఆ సిఫార్సును అందజేశారు. తరువాత ప్రధాని రాత్రి 8 గంటలకు టెలివిజన్‌లో ప్రకటించారు' అని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇది చట్టబద్ధమైన పాలనను అపహాస్యం చేసే అత్యంత దారుణమైన నిర్ణయం తీసుకునే ప్రక్రియ అని విమర్శించారు.

కులాలతో సంబంధం లేకుండా శ్మశాన వాటికలు నిర్మించండి

- తమిళనాడు ప్రభుత్వానికి హైకోర్టు సూచన

చెన్నై : కులాల వారీగా శ్మశాన వాటికల ఏర్పాటుకు ముగింపు పలకాలని తమిళనాడు ప్రభుత్వానికి మద్రాసు హైకోర్టు సూచించింది. కనీసం మృతి చెందిన వారినైనా ఈ కుల వివక్ష నుంచి రక్షించాలని హైకోర్టు పేర్కొంది. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళు గడిచినా దేశం ఇంకా కులతత్వ సంకెళ్లను తెంచుకోలేకపోతోందని, లౌకిక ప్రభుత్వం కూడా మతోన్మాద ప్రాతిపదికన వేర్వేరుగా దహనం, ఖననం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని జస్టిస్ ఆర్.సుబ్రమణియన్, జస్టిస్ కె కుమారేష్‌బాబులతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారం వ్యక్తం చేసింది. మనిషి చిట్టచివరి ప్రయాణంలోనైనా సమానత్వం ప్రారంభం కావాలని తీవ్ర వ్యాఖ్యలు చేసింది. కనీసం శ్మశాన వాటికలను అన్ని వర్గాలకు ఉమ్మడిగా మార్చేందుకు ప్రభుత్వం ముందుకు వస్తుందని ఆశిస్తున్నామని ధర్మాసనం తెలిపింది. సేలం జిల్లాలోని నవకురిచి గ్రామానికి చెందిన ఒక వ్యక్తి తన తల్లి మృతదేహాన్ని వెలికితీయడం కోసం వేసిన పిటీషన్ విచారణలో ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఎస్‌సిలకు శ్మశానంగా కేటాయించని స్థలంలో తన తల్లిని ఖననం చేశారని, దానిని వెలికి తీయడానికి అనుమతించాలని కోరాడు. ఈ విజ్ఞప్తిని హైకోర్టు కొట్టివేసింది.



కోల్‌కతాలో గురువులపై విరిగిన లాఠీ



కోల్‌కతా : ఉపాధ్యాయులపై పశ్చిమ బెంగాల్‌లోని తృణమూల్ ప్రభుత్వం మరోసారి విరుచుకుపడింది. బకాయిలు ఉన్న డైలీ అలవెన్స్‌ను వెంటనే పంపిణీ చేయాలని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం కోల్‌కతాలో ఉపాధ్యాయులు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఉపాధ్యాయ సంఘాలు, సమన్వయ కమిటీ ఐక్యంగా ఈ ప్రదర్శన నిర్వహించాయి. ఈ ప్రదర్శకులపై పోలీసులు దారుణంగా దాడికి పాల్పడ్డారు. చదువులు చెప్పే ఉపాధ్యాయులను లాఠీలతో దారుణంగా కొట్టారు. 48 మందిని అరెస్టు చేశారు. పోలీసుల దారుణాన్ని సిపిఎం, లెఫ్ట్ ఫ్రంట్ తీవ్రంగా ఖండించాయి. అరెస్టు చేసిన వారిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశాయి.

యుసిసి తెచ్చి తీరుతాం : అమిత్‌షా

న్యూఢిల్లీ : గుజరాత్ ఎన్నికల వేళ ఉమ్మడి పౌర స్మృతిని బిజెపి మళ్లీ తెరపైకి తీసుకొస్తోంది. యుసిసి తెచ్చి తీరుతామని సంకేతాలు ఇస్తోంది. ఉమ్మడి పౌర స్మృతి (యుసిసి) తీసుకొచ్చేందుకు బిజెపి కట్టుబడివుందని ఆ పార్టీ సీనియర్ నేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షా గురువారం పునరుద్ఘాటించారు. అన్ని విధాల ప్రజాస్వామిక చర్చలు, సమాలోచనలు పూర్తయిన తర్వాత కచ్చితంగా యుసిపి తీసుకొస్తామని ఆయన చెప్పుకొచ్చారు. జన్‌సంఘ్ రోజుల నుంచి యుసిసి కోసం ప్రయత్నిస్తున్నామని, యుసిసి తీసుకొస్తామని ప్రజలకు బిజెపి తరపున హామీ కూడా ఇచ్చామని ఆయన పేర్కొన్నారు. సముచిత సమయంలో యుసిసి తీసుకురావాలని రాజ్యాంగ అసెంబ్లీలోనూ పలువురు సలహాలు ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. లౌకిక దేశంలో మత ప్రాతిపదికను చట్టాలు ఉండరాదని తెలిపారు. అన్ని మతాల విశ్వాసులందరికీ పార్లమెంటు, రాష్ట్రాల శాసనసభలు ఆమోదించిన ఏకైక చట్టం ఉండాలని ఒక జాతీయ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన తెలిపారు.

కమల్‌హాసన్‌కు స్వల్ప అస్వస్థత

చెన్నై : ప్రముఖ నటుడు కమల్‌హాసన్ స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. జ్వరంతోపాటు శ్వాస సంబంధిత సమస్యలతో బాధపడుతున్నట్లు సమాచారం. దీంతో బుధవారం సాయంత్రం చెన్నైలోని శ్రీ రామచంద్ర మెడికల్ సెంటర్‌లో చేరారు. అత్యవసరమైన పరీక్షలు చేసినట్లు వైద్యులు తెలిపారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉంది. మరో రెండు రోజుల చికిత్స అనంతరం డిశ్చార్జి చేయనున్నట్లు వైద్యులు తెలిపారు.

పాక్ ఆర్మీ చీఫ్‌గా జనరల్ అసిమ్ మునీర్

ఇస్లామాబాద్ : పాకిస్థాన్ ఆర్మీ తదుపరి చీఫ్‌గా జనరల్ అసిమ్ మునిర్‌ను ఆ దేశ ప్రధానమంత్రి షెహబజ్ షరీఫ్ నియమించారు. ఈ విషయాన్ని పాకిస్థాన్ సమాచార శాఖ మంత్రి మరియం ఔరంగజేబ్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. ప్రస్తుత ఆర్మీ చీఫ్ జనరల్ ఖమర్ జవేద్ భజ్వా ఆరేళ్ల పదవీ కాలం ఈ నెల 29తో ముగియనుంది. ఆర్మీ చీఫ్‌గా జనరల్ అసిమ్ మునీర్‌ను నియమించడం వల్ల దేశంలో ఇప్పటికే కొనసాగుతున్న రాజకీయ సంక్షోభం మరింత తీవ్రతరమవుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కు బద్ధ విరోధిగా అసిమ్ మునీర్‌కు పేరుంది. ఇమ్రాన్‌ఖాన్ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు ఆర్మీ గూఢచారి విభాగం ఇంటర్-సర్వీసెస్ ఇంటెలిజెన్స్ చీఫ్ పదవి నుంచి మునీర్‌ను తొలగించారు.

తెలుగు రాష్ట్రాలకు చెందిన ఐదుగురు జడ్జిలు బదిలీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ హైకోర్టులకు చెందిన ఐదుగురు న్యాయమూర్తులను బదిలీ చేస్తూ సుప్రీం కోర్టు కొలీజియం సిఫారసు చేసింది. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ అధ్యక్షతన ఈనెల 24న జరిగిన కొలీజియం మూడు హైకోర్టులకు చెందిన ఏడుగురు న్యాయమూర్తులను బదిలీ చేస్తూ సిఫారసు చేసింది. ఆంధ్రప్రదేశ్ నుంచి ఇద్దరు, తెలంగాణ నుంచి ముగ్గురు, మద్రాస్ హైకోర్టు నుంచి ఇద్దరు బదిలీ అయ్యారు. ఏపి హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్ మద్రాసు హైకోర్టుకు, జస్టిస్ డి.రమేష్ అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేస్తూ సిఫారసు చేసింది. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కన్నెగంటి లలితను కర్నాటక హైకోర్టుకు, జస్టిస్ నాగార్జున్‌ను మద్రాసు హైకోర్టుకు, జస్టిస్ ఎ.అభిషేక్ రెడ్డిని పాట్నా హైకోర్టుకు బదిలీ చేస్తూ కొలీజియం సిఫారసు చేసింది.

ఆర్‌టిఐ పోర్టల్ ప్రారంభించిన సిజెఐ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆర్‌టిఐ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో దాఖలు చేసేందుకు సుప్రీం కోర్టు పోర్టల్ ప్రారంభించింది. గురువారం విచారణల ప్రారంభానికి ముందు పోర్టల్‌ను సిజెఐ జస్టిస్ డివై చంద్రచూడ్ ప్రారంభించారు. "సుప్రీంకోర్టులో ఆర్టీఐ పోర్టల్ సిద్ధమైంది. ఒక వేళ ఏమైనా సమస్యలు ఉంటే సరిచేస్తాం" అని సిజెఐ పేర్కొన్నారు. ఆర్‌టిఐ దరఖాస్తులకు సంబంధించి చెల్లించాల్సిన సొమ్ము ఇంటర్నెట్ బ్యాంకింగ్, మాస్టర్/వీసా క్రెడిట్ డెబిట్ కార్డు, యుపిఐ ద్వారా చెల్లించొచ్చు. దరఖాస్తు ధర రూ.10గా నిర్ణయించారు. దేశ పౌరులు మాత్రమే ఈ పోర్టల్ వినియోగించడానికి అవకాశం ఉన్నది.

అపారమైన పనిభారంతో న్యాయమూర్తులు సతమతం

సుప్రీం కోర్టు న్యాయమూర్తులు అపారమైన పని భారంతో సతమతమవుతున్నారని ఓ కేసు విచారణ సందర్భంగా సిజెఐ జస్టిస్ డివై చంద్రచూడ్ పేర్కొన్నారు. వచ్చే వారంలో 13 బెంచ్‌ల ముందు 525 అంశాలు జాబితా చేయాల్సి ఉన్నదనీ, ఒత్తిడి అపారంగా ఉన్నదని సిజెఐ వ్యాఖ్యానించారు. ప్రతి బెంచ్ ముందు సుమారు 45 నుంచి 50 కేసులు ఉంటున్నాయని అన్నారు



మాస్కోలో కాస్ట్రో విగ్రహావిష్కరణ

ఆవిష్కరించిన రష్యా, క్యూబా అధ్యక్షులు

మాస్కో : రష్యా రాజధాని మాస్కో నగరంలోని సోకోల్ జిల్లాలో ఫైడల్ కాస్ట్రో స్క్వేర్‌లో మంగళవారం మూడు మీటర్ల ఎత్తైన కాస్ట్రో కాంస్య విగ్రహాన్ని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, క్యూబా అధ్యక్షుడు మిగ్వెల్ డియాజ్ కానెల్ ఆవిష్కరించారు. చారిత్రక క్యూబా విప్లవనేత స్మృత్యర్థం ఈ విగ్రహావిష్కరణ జరిగింది. వ్యక్తిత్వ ఆరాధనను కాస్ట్రో తీవ్రంగా వ్యతిరేకించేవారు. క్యూబాలో ఆయన పేరుతో వీధులు, భవనాలు, సంస్థలు లేదా ప్రాంతాలు ఏవీ లేవు. విగ్రహాలు, అధికారిక ఫోటోలు, లేదా వీధుల పేర్ల రూపంలో జీవించి వున్న విప్లవ నేతను ఆరాధించరాదని 2003లో ఒక ప్రసంగంలో కాస్ట్రో స్పష్టం చేశారు. ఈ దేశ నేతలందరూ మానవులే, దేవుళ్లు కాదని వ్యాఖ్యానించారు. అందువల్ల క్యూబాకు వెలుపల మాత్రమే ఆయన పేరుతో స్మారకాలు వుంటాయి. ఫైడల్ వారసత్వాన్ని గౌరవిస్తూ మాస్కోలో చేపట్టిన ఈ కార్యక్రమం మారిన రష్యా వైఖరికి ప్రతీకగా నిలిచింది.



మీ కోసం

ఒక చిన్న పాత్రలో నీళ్లు పోసి అందులో నారింజ తొక్కలు వేసి అయిదు నిమిషాలు మరిగించాలి. వేడి చల్లారక ఆ తొక్కలతో శరీరంపై రాసుకుంటే చర్మం నిగనిగలాడుతుంది.

జీవన సౌరభం

నేర్చుకోవడం ఎప్పుడైతే ఆపేస్తామో.. అప్పుడే మన ఎదుగుదల ఆగిపోయినట్లు..!

JEEVANA జీవన the family

పుస్తకాలను ప్రేమిద్దాం



అక్షరాలతో చెలిమే చేద్దాం
వాక్యాలతో చేయి కలుపుదాం
పుస్తకాలతో పలకరించుదాం
ప్రపంచ జ్ఞానం తెలుసుకుందాం

పాఠ్యాంశాలు చక్కగ చదివి
ప్రశ్నకు జవాబు చెప్పేద్దాం
పరీక్షలో గెలుపు సాధిద్దాం
అందరి మెప్పును పొందేద్దాం

పుస్తకాలను ప్రేమిద్దాం
లోకజ్ఞానం కలిగి వుందాం
విజ్ఞానాన్ని పెంచుకుందాం
విజ్ఞతతో కలిసి జీవిద్దాం

గ్రంథాలయానికి రోజూ వెళ్దాం
వార్తా కథనాలు చదివొద్దాం
కథల పుస్తకాలు తిరగేద్దాం
మెదడుకు పదును పెట్టేద్దాం


గురువు మాటను ఆలకిద్దాం
చెప్పే పాఠాలు శ్రద్ధగా విందాం

భావం చక్కగా జ్ఞాపకం ఉంచుదాం
పదుగురికి సూచనలు ఇచ్చేద్దాం

చదువులో మేటిగా రానిద్దాం
ఒడిలో పుస్తకాన్ని ఇమిడిద్దాం
పేరాలన్నీ గమనించుదాం
సందర్భాన్ని ఆస్వాదించుదాం

పుస్తకాలే గురువుగా పూజిద్దాం
అందులో మనం మునకలేసేద్దాం
ఎన్నో సంగతులు తెలుసుకుందాం
భావితరాలకు అందిద్దాం

- నరెద్దుల రాజారెడ్డి
96660 16636



దారి చూపండి

చిన్నారులూ, కారులో పెట్రోల్ అయిపోయింది. మరి బంకు దగ్గరకు వెళ్లే మార్గం చూపి, సాయం చేయరూ!

నేను గీసిన బొమ్మ



- ఎం. మేఘన, 7వ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, లక్ష్మి దేవిపల్లి



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

అతని కల నిద్రలో వచ్చింది కాదు ..

ఎక్కడో పుట్టాడు.. ఎక్కడో పెరిగాడు.. హోటల్లో కప్పులు కడిగాడు. చెత్తకుప్పల్లో చెత్త ఏరాడు.. కడుపు నిండాలంటే ఏదైనా పని చేయాలి. ఆ పని కోసం ఈ దరి నుంచి ఆ దరికి కాల్వ ఈదేవాడు. అయినా పని దొరక్కపోతే ఆ చెత్తకుప్పలే ఆకలి తీర్చేవి. ఇన్ని కష్టాలు, బాధల మధ్య అతనో కల కన్నాడు. బాగా చదువుకోవాలి. చెత్త ఏరుకుంటున్న చెత్తకుండీ ఎదురుగా ఉన్న బ్యాంకులో ఉద్యోగం చేయాలని.. అలా 'కల అంటే నిద్రలో వచ్చేది కాదు.. నిద్ర పోనివ్వకుండా చేసేది' అన్నట్లుగా తన కల సాకారం కోసం అవిశ్రాంతంగా పోరాడి లక్ష్యం చేరుకున్న ఓ విజేత కథ ఇది.



ప్రతీకాత్మక చిత్రం

సందీప్ తండ్రి కోలకత్తా వాసి. తల్లి కడపకు చెందిన వారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యే కుటుంబంలోని ఆడపిల్లను ఆమె కంటే 25 ఏళ్ళు పెద్దవాడైన వ్యక్తికి ఇచ్చి పెళ్లి చేశారు. కడుపులో బిడ్డను మోసుకుంటూ ఆమె అతని వెంట తన వారెవరూ లేని చోటికి ప్రయాణమైంది. బిడ్డ పుట్టిన మూడేళ్లకే అతని నుంచి వేధింపులు ఎదురై మళ్లీ పుట్టింటికి చేరింది. ఆ మూడేళ్ల బిడ్డే సందీప్. పెళ్లి, బిడ్డ పెంపకం ఏమీ తెలియని వయసులో ఆ తల్లి సందీప్‌ను బంధువుల ఇంటికి పంపించేసింది. అక్కడ ఎన్నో అవమానాల మధ్య సందీప్ బాల్యం గడిచింది. 'బంధువుల ఇంట్లో నాతోటి పిల్లలు స్కూలుకు వెళుతుంటే నేను మాత్రం ఇంట్లోనే ఉండిపోయేవాడిని. ఇంటి పనులు చేసేందుకు నన్ను స్కూలుకు పంపేవారు కాదు. మీ అమ్మ మాకేమైనా డబ్బులు ఇచ్చిందా! మేమైనా నీకు బాకీ ఉన్నామా! అంటూ నానా దుర్భాషలాడేవారు. హోటల్లో పని చేసి వాళ్లకు డబ్బులిమ్మనేవారు. చాలా బాధేసేది' అంటున్న సందీప్ గమ్యం లేని తన ప్రయాణాన్ని కొనసాగించేందుకు హోటల్ పక్కనే ఉన్న కడప రైల్వే స్టేషనులో కనిపించిన రైలెక్కేశాడు. అది తిరుపతి చేరింది. తిరుపతి జంక్షన్‌లో రైలు దిగిన అతనికి ఏం చేయాలో తోచలేదు. అప్పుడు ఎవరో పెద్దమనిషి విజయవాడలో అనాథ పిల్లలను అక్కున చేర్చుకునే ఓ వసతి గృహం అడ్రస్ చెప్పి అక్కడికి పంపించాడు. వసతి గృహానికైతే చేరుకున్నాడు. తిండి, బట్టకు లోటు లేదు. కానీ అరకొర వసతులతో నడుస్తున్న అక్కడ తన చదువు కల నెరవేరేలా లేదు. ఆ ఆలోచన అతన్ని నిద్రపోనీయ్యలేదు. వసతి గృహ నిర్వాహకులకు తెలియకుండా తెల్లవారుజామున పక్కనే ఉన్న ఏలూరు కాల్వకు అడ్డంగా ఈ దరి నుంచి ఆ దరికి ఈదుకుంటూ వెళ్లి ఏలూరు లాకులు దగ్గర ముఠా కార్మికులను తీసుకెళ్లే ఫుట్‌పాత్‌పై ఎవరైనా పనికి తీసుకెళతారేమోనని ఎదురుచూస్తూ నుంచొనేవాడు. పని దొరికిన రోజు పని చేసుకోవడం, లేని రోజు చెత్త కాగితాలు ఏరుకుంటూ గడిపేవాడు. ఆకలి వేసినప్పుడు ఆ చెత్త కుప్పల్లో దొరికే రొట్టెలు తినేవాడు.

'పగలు పనిచేసుకుంటూ కాస్తో కూస్తో వచ్చిన డబ్బులు తీసుకెళ్లి రాత్రి పూట వసతిగృహం నిర్వహించే నిర్వాహకుడికి ఇచ్చేవాడిని. అలా నాలుగేళ్ల పూర్తయి డబ్బులు తీసుకుందామనుకునేసరికి అతను అక్కడ పని మానేశాడు. నాకే ఇలా ఎందుకు జరుగుతోంది. అమ్మ లేదు. నాన్న ఉన్నాడో.. లేడో.. తెలియదు. ఇప్పుడు నమ్మిన వ్యక్తి మోసం చేశాడు అంటూ బాధపడేవాడిని' అంటున్న సందీప్‌ను ఓ రోజు వసతిగృహ స్థాపకుడు అనుకోకుండా కలిశారు. దీనస్థితిలో ఉన్న అతన్ని అక్కున చేర్చుకుని తనకి జరిగిన అన్యాయానికి తాను బాధ్యత వహిస్తానంటూ ముందుకు వచ్చారు. అప్పుడు 'నాకు ఆ డబ్బులు వద్దు. ఎక్కడైనా స్కూల్లో చేర్పించండి. నాకు చదువుకోవాలనుంది' అని తన మనసులో మాట బయటపెట్టాడు సందీప్.





ప్రతీకాత్మక చిత్రం



బడి బాట

సందీప్ స్కూల్లో చేరాడు. పదేళ్ల వయసులో ఒకటో తరగతికి వెళ్లాడు. చదువుపై ఉన్న ఆసక్తితో చాలా తక్కువ సమయంలోనే పదోతరగతి పాసయ్యాడు. ఇప్పుడు మళ్లీ అతని సమస్య మొదటికొచ్చింది. ఇన్నేళ్లు దొరికిన వసతి ఇప్పుడు లేదు. అయినా భయపడలేదు. చదువుకుంటూనే డబ్బులు ఎలా సంపాదించవచ్చో స్కూలు నిర్వాహకులు నేర్పించిన పాఠాలను ఆకళింపు చేసుకున్న అతడు మళ్లీ పనివేట ప్రారంభించాడు. కాలేజీ చదువు, తిండి, వసతి ఇప్పుడు తన ముందున్న లక్ష్యం. స్వతహాగా తనకు అబ్బిన డ్యాన్సును ఇతరులకు నేర్పిస్తూ.. పాలప్యాకెట్లు, పేపర్లు వేస్తూ డబ్బు సమకూర్చుకోవడంలో ఎన్నో అవరోధాలు ఎదురయ్యాయి. వాటన్నింటినీ అధిగమించినా ఇంటర్ ఉత్తీర్ణత కాలేకపోయాడు. ఇప్పుడు మళ్లీ అతన్ని నిరాశ ఆవరించింది. 'పని చేసుకుంటేనే చదువుకునేది మరో దారి లేదు. ఇప్పుడెలా..!' అనుకుంటూ ప్రైవేటుగా డిగ్రీ కట్టి ఎంబిఎ పాసయ్యాడు.

ఎంబిఎ పట్టా పుచ్చుకుని తను కల గన్న బ్యాంకు ఉద్యోగం కోసం వెళ్లాడు. అతని ప్రతిభకు వెంటనే ఉద్యోగం వచ్చింది. ఎక్కడైతే తను చెత్త ఏరుకున్నాడో దానికెదురుగా ఉన్న బ్యాంకులోనే ప్రస్తుతం స్టాక్ మార్కెట్ విభాగానికి మేనేజర్‌గా వ్యవహరిస్తున్నాడు. పెళ్లి చేసుకున్నాడు. ఇద్దరు బిడ్డలు. ఇక్కడితో సందీప్ లక్ష్యం పూర్తవ్వలేదు. చదువుకుంటున్నప్పటి నుంచి తనలా వీధుల్లో తిరిగే పిల్లలు ఎక్కడ కనిపించినా వారిని కూర్చోబెట్టి మాట్లాడేవాడు. చదువు విలువ, డబ్బు విలువ చెప్పేవాడు. ఇప్పుడు కూడా వీధిబాలలు, అనాథలు, ఆర్థికంగా కుదేలైన పిల్లల కుటుంబాలను తరచూ కలుస్తాడు. చేతనైనంత సాయం చేస్తూ వారికి చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. సాయం చేయాలన్న లక్ష్యంతో ఉన్న అతను తన అవసరాలను కూడా వదులుకున్న సందర్భాలెన్నో ఉన్నాయి. సందీప్ లాంటి పిల్లలు మనకు తరచూ కనపడుతూనే ఉంటారు. అవగాహన లేక, ఆదరణ లేక సమాజంపై కక్ష పెంచుకుని మత్తు పదార్థాలకు బానిసలై, నేరప్రవృత్తి వైపు ప్రయాణించేవాళ్లనూ చూస్తూ ఉంటాం. అందరిలా సందీప్ చూస్తూ ఊరుకోలేదు. ఆ పిల్లలు పడే బాధలు, వారి ఆకలి కేకలు తనకు తెలుసు. అందుకే ఉద్యోగం తన లక్ష్యమైనా అంతకుమించిన సేవమార్గంలో నడుస్తున్నాడు. తన మార్గం ఎంతోమందికి స్ఫూర్తిదాయకం. లక్ష్యం ముందు ఎంతటి కష్టమైనా చిన్నదే అని నిరూపించిన సందీప్ నిజమైన లక్ష్యసాధకుడు.

- జ్యోతిర్మయి

నేటి తరానికి స్ఫూర్తి సుర్జీత్ స్కూలు

- స్వాతంత్ర్యోద్యమంలో బహిష్కరణకు గురైన విద్యార్థి పేరుతోనే పాఠశాల
- వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి వెంకట్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



బండాల గ్రామంలో సుర్జీత్ పాఠశాల వద్ద నేతలు



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న దృశ్యం

పసితనంలో జాతీయోద్యమ స్ఫూర్తితో ఉద్యమాల్లో అడుగుపెట్టిన హరికిషన్‌సింగ్ సుర్జీత్‌ను బహిష్కరించిన పాఠశాల నేడు ఆయన పేరుతో నడుస్తోంది. పంజాబ్ రాష్ట్రం జలంధర్ జిల్లా బండాల గ్రామంలో స్వాతంత్ర ఉద్యమ కాలంలో ఒక పాఠశాల ఉండేది. సుర్జీత్ విద్యాభ్యాసం చేసిన ఆ పాఠశాలను వ్యవసాయ కార్మిక సంఘం అఖిలభారత బృందం, సిపిఎం నాయకులు తాజాగా సందర్శించారు. స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొంటున్నారని సుర్జీత్‌ను బండాలా స్కూలు బహిష్కరించింది. నేడు అదే స్కూలుకు ఆయన నామకరణం చేసి ఆయన జ్ఞాపకాలన్నిటినీ నేటి విద్యార్థి లోకానికి తెలియజేసి, స్ఫూర్తిని రగిలింపజేయడం సంతోషకరమైన విషయమని వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి వెంకట్ అన్నారు.

జాతీయ ఉద్యమంలోకి విద్యార్థులందరినీ సమీకరించేందుకు ఆ స్కూల్ బెల్లును సుర్జీత్ వినియోగించేవారని చెప్పారు. భగత్ సింగ్ స్ఫూర్తితో రాజకీయ జీవితాన్ని ప్రారంభించి, సిపిఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శిగా సుదీర్ఘకాలం పని చేశారని గుర్తు చేశారు. 1982లో అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ఏర్పడేందుకు చొరవ తీసుకున్నారని, చివరి వరకు ఆ సంఘం జాతీయ కమిటీలో పని చేశారని తెలిపారు. స్వాతంత్ర్యం అంటే స్వదేశీయుల పాలనతోపాటు అందరికీ సమానత్వం, సామాజిక న్యాయం, సమాన హక్కులు సాధించబడాలని కోరుకున్నారని చెప్పారు. వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం కావాలని ఆయన పార్లమెంట్లో ప్రైవేట్ బిల్లును పెట్టారని, నేటికీ పాలకులు చట్టం చేయకపోవడం విచారకరమని అన్నారు. జాతీయ ఉద్యమం పిలుపు మేరకు భగత్ సింగ్ మొదటి వర్ధంతిని జరిపిన తొలి వ్యక్తిగా సుర్జీత్ చరిత్రపుటల్లో నిలుస్తారని తెలిపారు. బండాల స్కూలు విద్యార్థుల్లో సుర్జీత్‌తోపాటు పంజాబ్ సిఎంగా పనిచేసిన సర్దార్ దర్శన్ సింగ్ తదితరులు ఉన్నారని, వారి పేర్లు స్కూలు గోడపై చెక్కారని చెప్పారు. గత ఏడాది సుర్జీత్ పేరుతో ఆ రాష్ట్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలు నిర్వహించిందన్నారు. పంజాబ్ పర్యటనలో భాగంగా సుర్జీత్ సొంత గ్రామంలో పర్యటించడం గొప్ప అనుభూతినిచ్చిందని వెంకట్ అన్నారు. వ్యవసాయ కార్మిక ఉద్యమాన్ని మరింత అభివృద్ధి చేయడం, హిందుత్వ కార్పొరేట్ శక్తులను ఓడించడమే సుర్జీత్‌కు అర్పించే నివాళి అని అన్నారు. ప్రమాదానికి గురైన సుర్జీత్ కుమారుడు గురు చరణ్ సింగ్ బాచిని పరామర్శించినట్లు వెంకట్ తెలిపారు.

ఉరుగ్వేను నిలువరించిన కొరియా

ఫిఫా ప్రపంచకప్

దోహా: ఫిఫా ప్రపంచకప్-2022 గ్రూప్-హెచ్‌లో టైటిల్ ఫేవరెట్ ఉరుగ్వే జట్టును ఆసియా ఖండానికి చెందిన మరోజట్టు దక్షిణ కొరియా నిలువరించగలిగింది. నిర్ణీత సమయం ముగిసేవరకు ఉరుగ్వేకు ఒక్క గోల్ కొట్టే అవకాశం కూడా ఇవ్వకపోవడంతో ఇరుజట్ల మధ్య జరిగిన మ్యాచ్ 0-0తో డ్రా అయ్యింది. బంతిఎక్కువ భాగం ఉరుగ్వే చేతిలో ఉన్నా.. దక్షిణాఫ్రికా రక్షణశ్రేణి సమర్థవంతంగా ఆ దాడులను తిప్పి కొట్టగలిగింది. ఇరుజట్లలో ఒక్కో ఆటగాడు ఎల్లోకార్డుకు గురవ్వగా.. ఉరుగ్వే 10సార్లు, కొరియా 7సార్లు ప్రత్యర్థి గోల్‌పోస్ట్‌పై ఎదురు దాడులకు దిగాయి. ఉరుగ్వే జట్టుకు రెండో అర్ధభాగం 85వ నిమిషంలో గోల్ చేసే ఓ సువర్ణావకాశం లభించినా సద్వినియోగం చేసుకోలేకపోయింది. 1930, 50లలో రెండుసార్లు ఫిఫా టైటిల్‌ను గెలిచిన ఉరుగ్వే జట్టు గత సీజన్(2018)లో క్వార్టర్‌ఫైనల్ వరకు చేరగల్గింది. దీంతో ఇరుజట్లకు ఒక్కో పాయింట్ దక్కాయి.

స్విట్జర్లాండ్ శుభారంభం

గ్రూప్-జి తొలి లీగ్ మ్యాచ్‌లో స్విట్జర్లాండ్ జట్టు శుభారంభం చేసింది. గురువారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో స్విట్జర్లాండ్ 1-0తో కామరూన్‌ను ఓడించింది. స్విట్జర్లాండ్ తరఫున ఏకైక గోల్‌ను బ్రీల్ ఎంబోలో(48వ ని.)లో కొట్టాడు. స్విట్జర్లాండ్ 7సార్లు, కామరూన్ 8సార్లు ప్రత్యర్థి గోల్‌పోస్ట్‌పై దాడులకు దిగగా.. ఇందులో 3సార్లు బెల్జియం 5సార్లు కామరూన్ గోల్ చేసే అవకాశాన్ని చేజార్చుకున్నాయి. బెల్జియం జట్టుకు 11సార్లు కార్నర్లు లభించినా ప్రయోజనం లేకపోయింది. 2018లో స్విట్జర్లాండ్ జట్టు ప్రి క్వార్టర్స్‌కు చేరి స్వీడన్ చేతిలో ఓటమిపాలైంది.

గోల్ కొట్టినా.. సంబరాలకు దూరంగానే..

స్విట్జర్లాండ్ ఆటగాడు బ్రీల్ ఎంబోలో కామరూన్‌పై ఒక గోల్ కొట్టినా సంబరాలకు దూరంగా ఉన్నాడు. దీనికి కారణం లేకపోలేదు. ఎంబోలో ఆడుతోంది స్విట్జర్లాండ్ తరపున. కానీ అతను పుట్టి, పెరిగింది మాత్రం కామరూన్ రాజధాని యాండోలోనే. 8ఏళ్ల క్రితమే స్విట్జర్లాండ్ పౌరసత్వం పొందాడు. దీంతో కామెరూన్‌పై గోల్ కొట్టినా.. అతడు సంబరాలకు దూరంగా ఉన్నాడు.





చెమటోడ్చి నెగ్గిన బెల్జియం

బుధవారం అర్థరాత్రి జరిగిన గ్రూప్-హెచ్‌లో బెల్జియం 1-0 తేడాతో కెనడాను ఓడించింది. బెల్జియం తరఫున ఏకైక గోల్‌ను తొలి అర్ధభాగం ముగియడానికి ఒక్క నిమిషం ముందు(44వ ని.) మిచీ బాట్సుయ్ కొట్టాడు. ఫిఫా ర్యాంకింగ్స్‌లో స్విట్జర్లాండ్ 15వ స్థానంలో ఉండగా.. కెనడా 41వ ర్యాంక్‌లో ఉంది.

వచ్చే ఏడాది భారత వృద్ధి మరింత తగ్గొచ్చు: మూడీస్

న్యూఢిల్లీ : వచ్చే ఏడాది భారత వృద్ధి రేటు మరింత పడిపోనుందని గ్లోబల్ రేటింగ్ ఏజెన్సీ మూడీస్ విశ్లేషించింది. 2023లో దేశ వృద్ధి రేటు 5 శాతానికే పరిమితం కానుందని మూడీస్ గత ఆగస్టు రిపోర్టులో అంచనా వేసింది. 2021లో జిడిపి 8.5 శాతం పెరుగుదలను నమోదు చేయగా.. ప్రస్తుత ఏడాదిలో 8 శాతానికి తగ్గొచ్చని పేర్కొంది. భారత జిడిపి మరింత పడిపోవచ్చని తాజా 'అపాక్ అవుట్‌లుక్ : ఎ కమింగ్ డౌన్‌షిఫ్ట్' రిపోర్టులో పేర్కొనడం ఆందోళనకర అంశం. హెచ్చు ద్రవ్యోల్బణ కట్టడికి ఆర్‌బిఐ చేపడుతున్న వడ్డీ రేట్ల పెంపు వృద్ధి రేటును దెబ్బతీస్తుందని మూడీస్ పేర్కొంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తగ్గడానికి చైనా బలహీనతలు ఒక్కటే కారణం కాదని తెలిపింది. ఆసియాలోని మరో కీలక దేశం భారత ఎగుమతులు ఒత్తిడిని ఎదుర్కోవడం కూడా ప్రతికూలమేనని పేర్కొంది. 2021లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ 6 శాతం మందగించనుందని.. 2022లో ఇది 3.2 శాతానికి.. 2023లో ఏకంగా 2.7 శాతానికి పరిమితం కానుందని ఇటీవల అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) అంచనా వేసిన విషయం తెలిసిందే.

అండమాన్‌లో రేపు జి20 ప్రెసిడెన్సీ సమావేశం

పోర్టుబ్లెయిర్ : జి-20 శిఖరాగ్ర సమావేశం (ప్రెసిడెన్సీ మీటింగ్) ఈ నెల 26న అండమాన్ నికోబార్ దీవుల్లో జరగనుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయని గురువారం సంబంధిత అధికారులు తెలిపారు. పోర్టుబ్లెయిర్ నుంచి దాదాపు 2.30 గంటల పాటు సముద్రంలో ప్రయాణించాల్సిన స్వరాజ్ ద్వీప్ (హ్యావ్‌లాక్ ఐస్‌లాండ్‌గా సుపరిచితం)లో ఈ సమావేశం జరగనుంది. సమావేశంలో పాల్గొనే ప్రతినిధులంతా ప్రత్యేక విమానాల్లో 25న శుక్రవారం పోర్టుబ్లెయిర్‌కు చేరుకుంటారు. ఆ తదుపరి రోజు ఈ నెల 26న శనివారం నాడు శిఖరాగ్ర సమావేశం జరుగుతుంది. 27న ప్రతినిధులు తిరుగుప్రయాణమవుతారు. రమణీయమైన అండమాన్ నికోబారు దీవుల ప్రకృతి అందాలను, ప్రాచుర్యాన్ని పరిగణలోకి తీసుకొని జి-20 సమావేశాల్లో ఒక సమావేశాన్ని హ్యావ్‌లాక్‌లో నిర్వహించాలని ఢిల్లీలో జరిగిన జి20 సెక్రటేరియేట్ నిర్ణయించినట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

జెసి ప్రభాకర్ రెడ్డి మౌన ప్రదర్శన

ప్రజాశక్తి - అనంతపురం

తాడిపత్రిని ప్రశాంతంగా ఉండనివ్వండి అంటూ మాజీ ఎమ్మెల్యే, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి కోరారు. ఇదే నినాదంతో తన అనుచరులతో కలిసి మౌన ప్రదర్శన నిర్వహించారు. తాడిపత్రిలో నెలకొన్న పలు సమస్యలను తెలుసుకునేందుకు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జెసి అస్మిత్‌రెడ్డి ఇటీవల పలు వీధుల్లో పర్యటిస్తున్నారు. అందులో భాగంగా బుధవారం పట్టణంలోని 3వ వార్డు గాజులపాలెంలో పర్యటిస్తుండగా వైసిపి, టిడిపి నాయకుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది.

బోల్సోనారో పార్టీకి 43లక్షల డాలర్ల జరిమానా

శావోపాలో : ఇటీవల జరిగిన బ్రెజిల్ అధ్యక్ష ఎన్నికల ఫలితాలను రద్దుచేయాలంటూ అధ్యక్షుడు జేర్ బోల్సనారో, ఆయన పార్టీ చేసిన విజ్ఞప్తిని ఫెడరల్ ఎన్నికల కోర్టు (టిఎస్ఇ) అధ్యక్షుడు అలెగ్జాండర్ డీ మోర్సే తిరస్కరించారు. అక్టోబరు 30న జరిగిన రెండో రౌండ్‌పై తమ ఆడిట్‌లో కొన్ని ఓటింగ్ యంత్రాల్లో సరిదిద్దుకోలేని తప్పులు జరిగిన సంకేతాలను కనుగొన్నామని లిబరల్ పార్టీ పేర్కొంది. ఈ మేరకు తన ఫిర్యాదులో వివరించింది. వాటిని నిర్ధారించే ఆధారాలను అందజేయాల్సిందిగా కోర్టు కోరింది. ఎలాంటి ఆధారాలు సమర్పించకుండా, నిరాధారమైన, తప్పుడు ఫిర్యాదు చేశారంటూ బోల్సనారో పార్టీకి 22.9 మిలియన్ రియాన్లు (43లక్షల డాలర్లు) జరిమానాగా సుప్రీంకోర్టు విధించింది. అక్టోబర్‌లో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో బోల్సోనారో పరాజయం పాలైన సంగతి తెలిసిందే.

ట్రిపుల్ ఐటిలో విద్యార్థి ఆత్మహత్య

తల్లిదండ్రులు కలిసి ఉండాలని సూసైడ్ నోట్

ప్రజాశక్తి - వేంపల్లె

'నేను ఇలా ఆత్మహత్య చేసుకోవడం తప్పే, కానీ తప్పలేదు. దయచేసి అర్థం చేసుకోగలరూ.. ఇప్పటికైనా ఇద్దరూ కలిసి ఉండి మాట్లాడుకోండి. ఇదే నా చివరి కోరిక అనుకోండి'.అని సూసైడ్ నోట్ రాసి ట్రిపుల్ ఐటి విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన కడప జిల్లా ఇడుపులపాయలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు..అనంతపురం జిల్లా ఉరవకొండ పట్టణానికి చెందిన నాగభూషణం, ఇరావతి దంపతుల కుమారుడు శ్రీఈశ్వరసాయి (17) ఇడుపులపాయి ట్రిపుల్ ఐటిలో పియుసి-2 చదువుతున్నాడు. గురువారం క్లాస్‌కు వెళ్లకుండా హాస్టల్ గదిలోనే ఉండిపోయాడు. ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తిరిగి వచ్చిన విద్యార్థులు హాస్టల్ గది తలుపులు మూసి ఉండటాన్ని గమనించారు. తలుపులు కొట్టినా తీయకపోవడంతో వారు ట్రిపుల్‌ఐటి అధికారులకు సమాచారమిచ్చారు. ఫ్యాన్‌కు ఉరేసుకుని శ్రీఈశ్వరసాయి కన్పించడంతో వెంటనే ఇడుపులపాయలోని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఆత్మహత్య విషయాన్ని ఉరవకొండలోని తల్లిదండ్రులకు డైరెక్టర్ సంధ్యారాణి తెలియజేశారు. పోలీసులు ట్రిపుల్ ఐటికి చేరుకుని మృతుని గదిని పరిశీలించారు. విద్యార్థి రాసిన సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. తమకు ఎలాంటి కుటుంబ సమస్యలు లేవని, ట్రిపుల్‌ఐటిలో టీచర్లు పెట్టే మానసిక ఒత్తిడి వల్లే చనిపోయాడని మృతుని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చైనాలో రికార్డు స్థాయిలో కరోనా కేసులు

బీజింగ్ : చైనాలో బుధవారం రోజువారీ కరోనా కేసులు రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. బుధవారం చైనా వ్యాప్తంగా 31,444 కరోనా కేసులు నమోదైనట్లు అధికారులు గురువారం తెలిపారు. కరోనా మహమ్మారి ప్రారంభమైన తరువాత ఇంత భారీ సంఖ్యలో రోజువారీ కేసులు నమోదు కావడం చైనాలో ఇదే మొదటిసారి. ఇందులో 3,927 కేసుల్లో లక్షణాలు వుండగా, 27,517 కేసుల్లో ఎలాంటి లక్షణాలు లేవని ఆరోగ్య అధికారులు తెలిపారు.

ఇండియా-బి గెలుపు

మహిళల ఛాలెంజర్స్ ట్రోఫీ టి20

రాయ్‌పూర్: మహిళల టి20 ఛాలెంజర్ ట్రోఫీలో ఇండియా-బి జట్టు విజయం సాధించింది. చివరి బంతి వరకు ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో ఇండియా-బి 4వికెట్ల తేడాతో ఇండియా-సిపై గెలిచింది. పూజా వస్త్రాకర్ సారథ్యంలోని ఇండియా-సి జట్టు 20 ఓవర్లలో 6వికెట్లు నష్టపోయి 140పరుగులు చేసింది. ఓపెనర్లు మేఘన(26), ప్రియ పూనియా(27) తొలి వికెట్‌కు 9 ఓవర్లలో 52పరుగులు జతచేశారు. దీప్తి శర్మ, అరుంధతి రెడ్డికి మూడేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో ఇండియా-బి మహిళలు 19.5ఓవర్లలో 6వికెట్లు కోల్పోయి 141పరుగులు చేసి గెలిచారు. దేవిక వైద్యా(41నాటౌట్; 27బంతుల్లో 4ఫోర్లు), నిషూ చౌదరి(24; 15బంతుల్లో 4ఫోర్లు) బ్యాటింగ్‌లో మెరిసారు. శనివారం జరిగే ఫైనల్లో ఇండియా-డి జట్టు ఇండియా-ఏతో టైటిల్‌కై తలపడనుంది.

ఫిఫా ప్రపంచకప్‌లో నేడు...

గ్రూప్-బి: వేల్స్ X ఇరాన్(మ.3.30గం॥లకు)
గ్రూప్-ఏ: కతార్ X సెనెగల్(రా.6.30గం॥లకు)
నెదర్లాండ్స్ X ఈక్వెడార్(రా.9.30గం॥లకు)
గ్రూప్-బి: అమెరికా X ఇంగ్లండ్(రా.12.30గం॥లకు)

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68